

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

# వికసించిన బ్రహ్మకమలం



ఎన్ఎఫ్సీనగర్‌లో వికసించిన బ్రహ్మకమలం పుష్పాలు

**ఘట్‌కేసర్, జులై 29, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్సీనగర్‌లో అరుదైన బ్రహ్మకమలం వికసించింది. పుష్పాలలో ఏడాదికి ఒకేసారి పూసే పువ్వుగా దీనికి ప్రత్యేకత కలిగి ఉన్నది. ఎన్ఎఫ్సీ కంపెనీ విశ్రాంత ఉద్యోగి అలపాటి మల్లికార్జునరావు ఇంటి ఆవరణలో వివిధ రకాల పువ్వులు, పండ్ల చెట్లను పెంచుతున్నారు. మొక్కలకు మంగళవారం అర్ధరాత్రి నాలుగు బ్రహ్మకమలం పుష్పాలు విచ్చుకొని తెల్లవారు జామున తిరిగి మూసుకుపోయాయి. చీకట్లో వెలుగులు విరజిమ్ముతూ తెలుపు వర్ణంలో పూసిన పుష్పాలు చూపరులను విశేషంగా ఆకర్షించాయి. బ్రహ్మకమలం అంటే బ్రహ్మ కూర్చునే పువ్వు అని అర్థం. హైందవ సాంప్రదాయంలో దీనికి చాలా విశిష్టత ఉందని చెబుతారు. ఈమొక్కపై ఆకులే పుష్పంగా రూపాంతరం చెందడం ప్రత్యేకతగా చెబుతారు. ఈఅరుదైన పుష్పం ఆయన ఇంటి ఆవరణలో పెంచిన మొక్కలకు పూయడం తమకు ఆనందంగా ఉందని మల్లికార్జునరావు పేర్కొన్నారు. ఇరుగుపొరుగు జనం వచ్చి బ్రహ్మకమలాలను చూసి పరవశించిపోయారని కొందరు పూజలు చేశారని, ప్రతి సంవత్సరం ఇక్కడ పుష్పాలు విరగబూస్తున్నాయని తెలిపారు.

# ప్రకృతి పరిరక్షణకు ముందుకు రావాలి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 29, ప్రభాతవార్త:** ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా ముందుకు రావాలని, పులుల సంరక్షణ పట్ల సమాజంలోని అన్ని వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవరించాలని, ఈ భూమి మనుషుల ఆవాసం మాత్రమే కాదని, సమస్త జీవరాశులకు ఉమ్మడి నివాసం అని రాష్ట్ర అటవీ,పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ సూచించారు. బుధవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని దూలపల్లిలోని తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో నిర్వహించిన అంతర్జాతీయ పులుల దినోత్సవం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫారెస్ట్ అకాడమీలో ఫోటో ఎగ్జిబిషన్‌ను మంత్రి పరిశీలించారు. పులుల సంరక్షణకు సంబంధించిన లఘు చిత్రాన్ని మంత్రి కొండా సురేఖ వీక్షించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రతి ఏటా జులై 29న ప్రపంచపులుల దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. పులుల సంరక్షణ బాధ్యతపై ప్రపంచ వ్యాప్తంగా అవగాహన పెంపొందించేందుకు 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ప్రారంభమైన ఈ కార్యక్రమం నేడు ప్రకృతి పరిరక్షణకు ఒక గొప్ప వేదికగా నిలిచిందని మంత్రి అన్నారు. వేటలతో అడవుల నరికివేత, అక్రమ రవాణా వంటి కారణాలతో వాటి సంఖ్య తీవ్రంగా



ఫారెస్ట్ అకాడమీలో జరిగిన ప్రదర్శన కార్యక్రమాన్ని పరిశీలించిన రాష్ట్ర అటవీ,పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ.



పులి ఫోటోను మంత్రి కొండ సురేఖకు అందజేస్తున్న రాష్ట్ర అటవీ శాఖ అధికారులు

తగ్గిపోయిందని మంత్రి సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చేందుకు 1972లో వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని, 1973లో ప్రాజెక్టు టైగర్ అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ప్రారంభించి దేశవ్యాప్తంగా పులుల సంరక్షణకు బలమైన చర్యలు చేపట్టిందని ఆమె వివరించారు. ఈ చర్యల ఫలితంగానే నేడు భారతదేశంలో ప్రపంచ పులుల సంరక్షణలో అగ్రగామిగా నిలిచిందని మంత్రి అన్నారు. ప్రపంచంలోని మొత్తం పులుల్లో సుమారు 75శాతం భారతదేశంలోనే ఉన్నాయన్నారు. ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న వివిధ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు అటవీ సంపదను పరిరక్షించటంలో నిబద్ధత, నిజాయితీ, సేవాభావంతో పని చేసి భావితరాలకు పచ్చని తెలంగాణను అందించాలని సూచించారు. అటవీ సంపద, వన్య ప్రాణుల సంరక్షణలో విశేషకృషి చేసిన పలువురు అటవీశాఖ ఉద్యోగులకు ప్రశంసాపత్రంతో పాటు నగదు బహుమతిని మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో అటవీ దళాల ప్రధాన సంరక్షణ అధికారి వినయ్‌కుమార్, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ దండా రాజిరెడ్డి, పిసిసిఎఫ్ (డవలప్‌మెంట్) రత్నాకర్ జౌహారి, సిసిఎఫ్ టిజిఎస్ఎఫ్ఎ డైరక్టర్ ప్రియాంక వర్గీస్, సిసిఎఫ్ ఎన్ క్షితిజ, టైగర్ సెల్ రిసర్చ్ సైంటిస్ట్ అయాన్‌సాధూ, అమ్రాబాద్ ఫీల్డ్ డైరక్టర్ ప్రసాద్, కవాల్ టైగర్ రిజర్వు ఫీల్డ్ డైరక్టర్ శాంతారాం,పలువురు అటవీశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నరకయాతనగా దోర్నాల వంతెన ప్రయాణం

**అధికారుల నిరక్ష్యంపై తీవ్ర ఆగ్రహం!**

**ధారూర్,జులై 29, ప్రభాత వార్త:** ధారూరు మండల పరిధిలోని దోర్నాల ధారూరు స్టేషన్ గ్రామాల మధ్య కొట్టుకుపోయిన కొత్త వంతెన నిర్మాణం తొమ్మిదేళ్ల గడుస్తున్నా పూర్తికాకపోవడం అధికారుల దారుణ వైఫల్యానికి అద్దం పడుతోంది. 2016లో వర్షాలకు కొట్టుకుపోయిన ఈ వంతెనకు అప్పట్లో రూ. 4.70 కోట్లు, ఆ తర్వాత ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మరో రూ. 2.60 కోట్లు అదనంగా మంజూరు చేసినా క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం మారలేదు.



దోర్నాల వంతెన వద్ద రోడ్డు పరిస్థితి

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో వంతెన అప్రోచ్ రోడ్డు అంతా పూర్తిగా బురదమయంగా మారుతోంది. కనీసం నడవడానికి కూడా వీలులేకుండా తయారైన ఈ దారిలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాలు బురదలో జారి (స్కిడ్ అయి) కింద పడిపోయే ప్రమాదాలు పొంచి ఉన్నాయని, ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ప్రయాణికులు మండిపడుతున్నారు. ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నారే తప్ప, పనుల్లో వేగం పెరగకపోవడంతో నాగారం, మైలారం, మోమిన్ కుర్దు, రాజాపూర్, అంపల్లి, కుమ్మరి పల్లి తదితర 30 నుంచి 40 గ్రామాల ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిద్రమత్తు వీడి, కేవలం మాటలతో కాలయాపన చేయకుండా వెంటనే అప్రోచ్ రోడ్డు పనులను వేగవంతం చేయాలని, లేదంటే ప్రజాగ్రహాన్ని ఎదుర్కొవాల్సి వస్తుందని స్థానికులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.

## అకాల వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

**వికారాబాద్,ప్రభాతవార్త :** అకాల వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి ఎంపీడీఓ, తహసిల్దార్లు, రెవెన్యూ, పోలీస్,పంచాయతీరాజ్, నీటిపారుదల, ఇరిగేషన్, వైద్యం,గ్రామ పంచాయతి, విద్యుత్, మున్సిపల్,తదితర శాఖల అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లోతట్టు ప్రాంతాలు వాగులు, చెరువులు, కాలువల పరిసర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో కల్వర్టు, వాగులు, చెరువులు ,నీటి నిల్వలు, రహదారులపై నీరు చేరడం, పాత బిల్డింగ్స్,చెట్లు కూలడం వంటి ఘటనలు జరిగితే వెంటనే స్పందించేలా అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన యంత్రాంగం, సిబ్బంది, సహాయక బృందాలను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సకాలంలో సహాయ సహకారాలు అందించి, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

మండలాల్లో వాగులు, చెరువు లను గుర్తించి గ్రామ పంచాయతీ వారీగా మ్యాపింగ్ చేసి రిపోర్ట్ పంపించాలన్నారు. జిల్లా ప్రజలు వర్షాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాలు, వాగులు, వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలకు అనవరంగా వెళ్లవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.జిల్లా ఎస్పి స్నేహమెహ్రా మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కువ వర్షా పాతం ఉండే అవకాశం ఉన్నందున జిల్లాలో 52 లో లైన్ ఏరియాలు ఉన్నాయని, వాగులు బ్రిడ్జి, కల్వర్టులు ఉండే చోట బారికేడ్స్ ఏర్పాటు చేసి, ప్రజలు ఎవ్వరు వెళ్ళకుండా మండల స్థాయి అధికారులు ముందస్తు జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ పరిధిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 24 గంటలు పనిచేసే విధంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. వికారాబాద్ జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్, నెంబర్ 8712670056 కు సమాచారమివ్వలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎస్ఐఆర్ పై మాట్లాడుతూ, జిల్లా లో 78 శాతం పూర్తయిందని, గ్రామ పంచాయతి పరిదిలో సర్పంచులు, ప్రజా ప్రతినిదులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఏ ఒక్క ఓటరు మిస్ కాకుండా చూడాలని తెలిపారు. ఓటర్ల జాబితాలో ఒక ఓటరుకు రెండు ఓట్లు ఉండటం,చనిపోయిన వారి పేర్లు తొలగించకపోవడం వంటి పొరపాట్లు జరుగకుండా జాగ్రతలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు, ఉమా శంకర్ ప్రసాద్, వెంకటచారి, ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టుర్, అడిషనల్ ఎస్పి రాజేష్ మీనా, డీఆర్ఓ స్వర్ణలత, ఆర్డీఓ వాసు చంద్ర పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించాలి

**మోమిన్‌పేట్,జులై 29. ప్రభాతవార్త:** వార్షిక తనిఖీలలో భాగంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ బుదవారం నాడు మోమిన్‌పేట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వికారాబాద్ డీఎస్పీ అంజయ్య ఎస్పీకి బొకే అందజేసి జిల్లా ఎస్పీకి ఘన సన్మానం. తదుపరి పోలీస్ సిబ్బంది టర్నవుట్, క్రమశిక్షణ, విధి నిర్వహణలో వారి సన్నద్ధత, యూనిఫారం నిర్వాహణ తదితర అంశాలను ఎస్పీ పరిశీలించారు. పోలీసు సిబ్బంది ఎల్లప్పుడు క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ రిజిస్టర్, స్టేషన్ హౌస్ రికార్డులు, క్రైమ్ రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, హిస్టరీ షీటర్లు, రౌడీ షీటర్లు, బైండోవర్ కేసులు, మహిళలు మరియు చిన్నారులకు సంబంధించిన కేసుల దర్యాప్తు, పోక్సో కేసుల పురోగతి, ఎన్డీపీఎస్ కేసులు, ఆస్తుల నిర్వహణ, మాల్ఖానా, స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సీసీటిఎన్ఎస్ నమోదు, ఈ. సాక్ష్యా అమలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ మరియు కంట్రోల్ వ్యవస్థ, సీసీటీవి కెమెరాల పనితీరు, వికారాబాద్ "రక్షణ నేత్రం" కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన కెమెరాల వినియోగం, గ్రామాలు మరియు పట్టణ ప్రాంతాల్లో నిఘా వ్యవస్థను మరింత పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు సత్వర, పారదర్శక, నాణ్యమైన పోలీసు సేవలు అందించడం ప్రతి పోలీస్ అధికారి ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.



ఎస్పీకి బొకె ఇచ్చి స్వాగతిస్తున్న డిఎస్పి అంజయ్య

పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు, నేరాల నియంత్రణ, విజిబుల్ పోలిసింగ్, రాత్రి గస్తీ, అనుమానస్పద వ్యక్తుల తనిఖీలు, సైబర్ నేరాల నివారణ, మహిళల భద్రత, రోడ్డు భద్రత, కమ్యూనిటి పోలిసింగ్ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. "అనంతరం ఎస్పీ స్నేహ మెహ్రా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటి నీరు పోశారు".

ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, మోమిన్‌పేట్ సీఐ వెంకట్, స్థానిక ఎస్ఐ భరత్ భూషణ్, పోలీసు అధికారులు, సిబ్బంది, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో కల్లోలం..!

**-బిఎల్ఎల సమావేశంలో భగ్గుమన్న అంతర్గత కుమ్ములాట-వలస నేతలకు పదవులు**

**- అసలు కాంగ్రెస్ కార్యకర్తలకు నిరాశలు**



**మొయినాబాద్, జులై 29, ప్రభాతవార్త :** మొయినాబాద్ మండల, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఓటరు నమోదు (సార్) కార్యక్రమంలో పార్టీకి చెందిన బీఎల్ఏలు ఎలా పనిచేయాలనే అంశంపై బుధవారం మొయినాబాద్ మండల మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడులు బొలిగిద్ద సత్యనారాయణ కౌన్సిలర్ విక్రమ్ రెడ్డి ఇరువురి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం తీవ్ర వాగ్వాదాలకు, పరస్పర ఆరోపణలకు వేదికగా మారింది. ఒకరిపై ఒకరు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేయడంతో సమావేశం కొంతసేపు ఉద్రిక్తంగా కొనసాగింది.సమావేశంలో పలువురు సీనియర్ కార్యకర్తలు, నాయకులు మాట్లాడుతూ, ఏళ్ల తరబడి కాంగ్రెస్ జెండా మోస్తూ పార్టీ కోసం కష్టపడిన తమను పూర్తిగా పక్కనపెట్టి, ఇటీవల ఇతర పార్టీల నుంచి వచ్చిన వలస నాయకులకు కీలక పదవులు అప్పగించడం తీవ్ర నిరాశకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అసలైన కాంగ్రెస్ కార్యకర్తలకు న్యాయం జరుగుతుందనే ఆశలు పెట్టుకున్నామని, కానీ పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉందని మండిపడ్డారు. మొయినాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తోల్కట్ట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నారాయణ ను నియమించగా మొయినాబాద్ మున్సిపాలిటీ అధ్యక్ష పదవి ఎంపికలో కూడా మొదటి నుంచి కాంగ్రెస్ కోసం పనిచేసిన వారిని విస్మరించి, ఇటీవల పార్టీలో చేరిన నాయకుడికి బాధ్యతలు అప్పగించారని కొందరు నాయకులు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇదే ధోరణి కొనసాగితే పార్టీ బలోపేతం కాకుండా బలహీనపడుతుందని హెచ్చరించారు.ఇటీవల ఖాళీ కానున్న పి ఎస్ సి ఎస్ సి చైర్మన్ పదవిని కూడా గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న వ్యక్తికే అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ కొందరు నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "మొదటి నుంచి కాంగ్రెస్ కోసం పోరాడిన కార్యకర్తలను పక్కనబెట్టి వలస నేతలకు వరుసగా పదవులు ఇస్తే ఇక సహించేది లేదు" అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమావేశంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు.రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ కోసం ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్యకర్తలకే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, వలస నాయకులకు టికెట్లు కేటాయిస్తే తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుందని సమావేశంలో స్పష్టం చేసినట్లు తెలిసింది.ఈ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గంలో కొనసాగుతున్న వర్గపోరుపై కూడా కార్యకర్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య వర్గం, కాంగ్రెస్ ఇన్‌చార్జి భీమ్ భరత్ వర్గాల మధ్య సమన్వయం లేకపోవడం పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ విభేదాలను అధిష్ఠానం వెంటనే పరిష్కరించకపోతే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు.గత మున్సిపల్ ఎన్నికల్లో కూడా అంతర్గత విభేదాల కారణంగా కాంగ్రెస్ ఆశించిన స్థాయిలో మెజార్టీ సాధించలేకపోయిందని, అదే పరిస్థితి మరోసారి పునరావృతమైతే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీకి భారీ రాజకీయ నష్టం తప్పదని పలువురు నాయకులకు సూచించారు.

## అంతర్‌రాష్ట్ర చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్



**షాద్‌నగర్, జులై 29, ప్రభాతవార్త :** కేశంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. భవిష్యత్ సిటీ కమిషనరేట్ పరిధిలోని కేశంపేట, కడ్తాల్, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల్లో జరిగిన చైన్ స్నాచింగ్, ద్విచక్ర వాహనాల చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి మీడియాకు తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. స్థానిక డిసిపి శిరీష రాఘవేంద్ర, ఏసిపి లక్ష్మీ ్మనారాయణ, కేశంపేట సీఐ నరహరి తదితరులు మీడియా సమస్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ తరుణ్ జోషి మాట్లాడుతూ..సుమారు 7 తులాల బంగారు గొలుసులు, మూడు మొబైల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. పంజాబ్ రాష్ట్రానికి చెందిన సుఖ్‌దేవ్ సింగ్ (38), షమ్షేర్ సింగ్ (36), మన్‌ప్రీత్ సింగ్ (24) హార్వెస్టర్ డ్రైవర్లు, కూలీలుగా పనిచేస్తూ తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాలపై అవగాహన పెంచుకున్నారు. వృద్ధురాలి మెడలోని 4 తులాల బంగారు పుస్తెలతాడు అపహరణ, జూలై 25న కేశంపేట మండలం సంతాపూర్ గ్రామ శివారులో ఓ వృద్ధురాలు తన మనవరాలితో కలిసి వెళ్తుండగా.. మోటార్‌సైకిల్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు దారి అడిగినట్లు నటించి, ఒక్కసారిగా ఆమె మెడలోని 4తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని పరారైనట్లు పోలీసులు తెలిపారు. అదే రోజు కడ్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోనూ మరో మహిళను బెదిరించి, కింద పడేసి ఆమె మెడలోని 3 తులాల బంగారు పుస్తెలతాడును అపహరించినట్లు విచారణలో వెల్లడైంది.మరో కేసులో చోరీ చేసిన బైక్‌తోనే చైన్ స్నాచింగ్‌జూన్ నెలలో కొత్తకోట ప్రాంతంలో ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసి, అదే వాహనంతో చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు నిందితులు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం చోరీ చేసిన బంగారు ఆభరణాలను విక్రయించి డబ్బును పంచుకున్నట్లు వెల్లడించారు. జూలై 23న నాందేడ్ నుంచి సికింద్రాబాద్‌కు రైలులో వచ్చిన నిందితులు, అక్కడి నుంచి మరోసారి నేరాలకు పాల్పడేందుకు సిద్ధమైనట్లు పోలీసులు పేర్కొన్నారు. జూలై 24న మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద పార్క్ చేసిన హోండా సీడీ100 ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసి, దానితో కేశంపేట, కడ్తాల్ ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడినట్లు తెలిపారు.

**కేశంపేట ఎక్స్ రోడ్డులో అరెస్ట్**

మరో చైన్ స్నాచింగ్‌కు సిద్ధమవుతున్న సమయంలో జూలై 29న కేశంపేట ఎక్స్ రోడ్డు వద్ద ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.విచారణలో కేశంపేట, కడ్తాల్, మహబూబ్‌నగర్ టౌన్, కొత్తకోట పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన పలు కేసులకు సంబంధించి నిందితులు తమ ప్రమేయాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.కేసు ఛేదనలో నిజామాబాద్ పోలీసులు, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి పర్యవేక్షణలో, షాద్‌నగర్ డివిజన్ ఏసీపీ సిరిషా రాఘవేంద్ర, ఏసీపీ ఎస్. లక్ష్మీ ్మనారాయణ, కేశంపేట సీఐ బి. నరహరి, ఎస్ఐ టీ. రాజ్‌కుమార్, కేశంపేట పోలీస్ సిబ్బంది, జోనల్ క్రైమ్ టీమ్ కీలకంగా పనిచేసినట్లు పోలీసుల ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రజాధనం బుగ్గిపాలు

**-ఐదేళ్లు కూడా నిలవని రోడ్డు**

**-చింతకుంటపల్లిలో ప్రజలకు తప్పని తిప్పలు**



రహదారిపై గుంతలో నిలిచిన నీరు

**కేశంపేట ,జులై 29, ప్రభాతవార్త :** నాణ్యతలోపమా నిధుల బొక్క ఐదేళ్లకి చిత్రమైన రోడ్డు చూసేందుకే రోడ్డు నడిస్తే నరకమే ఇది రోడ్డు పరిస్థితి. విషయానికొస్తే కేశంపేట మండలం చింతకుంటపల్లి గ్రామ ప్రధాన రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు కురిసిన సమయంలో రహదారిపై గుంతలు, బురద, నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రమాదకరంగా మారుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ రహదారి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించబడిందని గ్రామస్తులు పేర్కొన్నారు. అయితే రోడ్డు నిర్మించి ఐదేళ్లు కూడా పూర్తికాకముందే పూర్తిగా దెబ్బతినడంపై పనుల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల పన్నుల డబ్బుతో నిర్మించిన రహదారి ఇంత తక్కువ కాలంలోనే శిథిలావస్థకు చేరుకోవడం బాధాకరమని వారు పేర్కొన్నారు.రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించారా సంబంధిత అధికారులు పనులను ఎలా ఆమోదించారు రహదారి ఇంత త్వరగా ఎందుకు దెబ్బతింది అనే ప్రశ్నలను గ్రామ ప్రజలు లేవనెత్తుతున్నారు. నాణ్యతపై క్వాలిటీ ఆడిట్ నిర్వహించాలి చింతకుంటపల్లి గ్రామ రహదారిని ప్రభుత్వం వెంటనే పరిశీలించి, అత్యున్నత నాణ్యత ప్రమాణాలతో కొత్త బీటీ రహదారిని నిర్మించాలని బీజేపీ యువ నాయకుడు అనెమోని కృష్ణ యాదవ్ కోరారు. గతంలో చేపట్టిన రహదారి పనులపై సాంకేతిక నాణ్యత (క్వాలిటీ ఆడిట్) నిర్వహించి, ఏవైనా లోపాలు బయట పడితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రజలకు రాజకీయాలు కాకుండా నాణ్యమైన అభివృద్ధి అవసరమని, ఐదేళ్లు కూడా నిలవని రోడ్లు కాకుండా తరతరాలకు ఉపయోగపడే నాణ్యమైన రహదారులను నిర్మించాలని గ్రామస్తులు, వాహనదారులు అన్నారు

## కన్నుల పండువగా పెరుగు బసంతోత్సవం



పెరుగు బసంతోత్సవంలో పాల్గొన్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



ధ్వజ స్థంభంపై ఉంచిన పెరుగు కుండను పగుల గొట్టేందుకు పోటీ పడుతున్న ఆలయ సిబ్బంది

**వికారాబాద్,ప్రభాతవార్త :** అనంతగిరిలో కొలువైన శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆషాడ మాస చిన్న జాతర ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన పెరుగు బసంతోత్సవ కార్యక్రమం బుధవారం ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ పెరుగు బసంతోత్సవానికి చుట్టూర ప్రాంతాల్లోని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఇందులో భాగంగా స్వామి వారిని ఆలయ వీధుల్లో పల్లకిలో ఊరేగించారు. అనంతరం పెరుగు బసంతోత్సవ కార్యక్రమం భక్తుల కోలాహలం మధ్య ఆలయ అర్చకులు నిర్వహించారు. ఈ పెరుగు బసంతోత్సవం కార్యక్రమానికి అసెంబ్లీ స్పీకర్ ముఖ్యతిథిగా వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్పీకర్ రాకను పురస్కరించుకుని ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనం చేశారు.

అనంతరం పెరుగు బసంతోత్సవాన్ని స్పీకర్ తిలకించారు. ఆలయ సిబ్బంది పెరుగు బసంతోత్సవ పెరుగు కుండను ఆలయ ధ్వజ స్థంభంపై ఉంచేందుకు పోటీ పడ్డారు. పెరుగు కుండను పగుల గొట్టడంతో పెరుగు బసంతోత్సవం ముగిసింది. కుండ పెంకులు తీసుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. కుండ పెంకులు ఇంటిలోని బీర్వా, వ్యాపార దుకాణాల్లో గల్లా పెట్టెలో ఉంచి కలిసి వస్తుందని భక్తుల నమ్మకం. దీంతో పెరుగు కండ పెంకులు చేజిక్కించేందుకు భక్తులు పోటీ పడ్డారు. పెరుగు బసంతోత్సవం అనంతరం భక్తులు క్యూలైన్లో వేచి ఉంచి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య, మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్, కౌన్సిలర్లు లక్ష్మీకాంత్‌రెడ్డి, మల్లికార్జున్‌గౌడ్, చిగుర్లపల్లి రమేశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## జైత్వారం, గపూర్ నగర్ గ్రామాల మధ్య
## 3 కిలోమీటర్ల రోడ్డు రూ 4.50 కోట్లతో నిర్మాణం



**కందుకూరు, జులై 29, (ప్రభాతవార్త):** కందుకూరు మండల పరిధిలోని జైత్వారం, గపూర్ నగర్ గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణం పనులను స్థానిక సర్పంచ్ బైరు కొండల్ రెడ్డి, మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణా నాయక్ లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి జంగారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు మారుమూలకు చేరాలనేదే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములై ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గఫూర్ నగర్, జైత్వారం గ్రామాల మధ్య మూడు కిలోమీటర్ల నిడివి గల రోడ్డునిర్మాణానికి ప్రభుత్వం నాలుగున్నర కోట్ల రూపాయలను మంజూరి చేసిందన్నారు. ఈ నిధులతో చేపట్టే రోడ్డు పనులను ప్రతిష్టవంతంగా నిర్మించుకోవాలని సూచించారు. ఈ రోడ్డు నిర్మాణం ద్వారా జైతారం గ్రామం నుండి గఫూర్ నగర్, కొత్తూరు, గ్రామాలమీదుగా హైదరాబాద్ వెళ్లడానికి మార్గం సుగమం అవుతుందని తెలిపారు. ఈ ప్రాంతం భవిష్య నగరి పరిధిలో ఉన్నందున అభివృద్ధి పదాన దూసుకుపోతుందని ఈ ప్రాంతం గుండా నే శంషాబాద్, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, చెన్నై మధ్య బుల్లెట్ ట్రైన్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అదేవిధంగా శంషాబాద్ నుండి బెంగళూరు వరకు మరో బుల్లెట్ ట్రైన్ ఈ మార్గం గుండానే ప్రయాణం చేస్తుందని దానికోసం ప్రణాళికలు జరుగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం అనుమతి కూడా లభించిందని సర్వే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని సూచించారు. రవాణా సౌకర్యాలు ఉంటే ఆ ప్రాంతాలు అభివృద్ధి పథాన ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కె రాణా ప్రతాపరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు డి శంకర్, ఉప సర్పంచ్ నవీన్, వార్డు సభ్యులు మమత మహేందర్, రాజశేఖర్, సత్యనారాయణ, లక్ష్మి ్మ అంజయ్య, సెక్రటరీ వెంకటయ్య, మాజీ ఎంపిటిసి పర్వతాలు యాదవ్, శ్రీశైలం యాదవ్, రామ చంద్రయ్య, బాబు, అంజయ్య, శ్రీను గ్రామ

### శాకాంబరిమాతగా రాజరాజేశ్వరీదేవి



శివారెడ్డిగూడలో శాకాంబరిమాత అలంకారంలో అమ్మవారు

**ఘట్‌కేసర్, జులై 29, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ శివారెడ్డిగూడలోని శ్రీదండ్లగడ్డ ప్రసన్నవీరాంజనేయ భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి ఆలయంలో కొలువైన శ్రీరాజరాజేశ్వరీదేవి అమ్మవారు బుధవారం శాకాంబరి మాత అలంకారంలో భక్తులకు దివ్యదర్శనం ఇచ్చారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో ప్రకృతిమాత స్వరూపంగా అలంకరించిన అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ శుద్ధ పౌర్ణమి, వ్యాస పౌర్ణమి సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. ఆలయ చైర్మన్ కొంతం రాంరెడ్డి, అర్చకులు వరదరాజుల ఆధ్వర్యంలో శాకాంబరి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఆషాఢ మాసంలో పౌర్ణమికి ముందు మూడు రోజుల పాటు శాకాంబరీ ఉత్సవాలు ఘనంగా జరిపారు. శాకంబరీ దేవి సృష్టి పోషణకు, వృక్షసంపదకు అధిష్టాన దేవతని ఆమెను ఆదిపరాశక్తి అయిన దుర్గాదేవి అవతారంగా భావిస్తారని, లోకంలో కరువు కాటకాలను రూపుమాపి, సకల జీవులకు ఆహారాన్ని, వర్షాలను ప్రసాదించే తల్లిగా ఈమెను భక్తులు కొలుచుకుంటారని వారు పేర్కొన్నారు.

## విద్యుత్ ఘాతంతో ఆవు మృతి

**కేశంపేట, జులై 29, ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామం బాల్యతాండకు చెందిన ఉడిత్యవత్ శివకు చెందిన ఆవు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తాకి కరెంట్ తగలడం తో మృతి చెందింది. ఆవు విలువ దాదాపుగా సుమారు రూ.50 వేల విలువైన ఆవును కోల్పోవడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. జీవనాధారమైన పశువును కోల్పోవడంతో కుటుంబం కన్నీరు మున్నీంంవుతోంది. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకొని జీవనోపాధిని కల్పించాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు.



మృతి చెందిన ఆవు

## కుల్కచర్లను నూతన నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలి

**-కుల్కచర్లలో ప్రజా సంఘాల ఆందోళన**

**కుల్కచర్ల, జులై 29,ప్రభాతవార్త :** కుల్కచర్ల మండలాన్ని నూతన అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కుల్కచర్ల ప్రధాన చౌరస్తా వద్ద నిరసన



ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కుల్కచర్ల మండలానికి నియోజకవర్గంగా ఏర్పడేందుకు అవసరమైన అన్ని వనరులు ఉన్నప్పటికీ అభివృద్ధిలో వెనుకబడి ఉందన్నారు. ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పాటు చేస్తే ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు లభించి ప్రాంత అభివృద్ధి వేగవంతమవుతుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వచ్చే ఎన్నికలకు ముందు జరిగే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో కుల్కచర్లకు ప్రత్యేక నియోజకవర్గ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ నెరవేరకపోతే త్వరలో ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాట్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు ఘనపూర్ రాఘవేందర్ గౌడ్, కుల్కచర్ల సర్పంచ్ వార్వాల అంజిలయ్య, మాజీ సర్పంచ్ జానకిరామ్, బీజేపీ నాయకులు గాదె మైపాల్, మండల అధ్యక్షుడు గుడాల వెంకటేష్, డిప్యూటీ సర్పంచ్ విజయ్, కర్రీ వినోద్, గడసు మైపాల్, హనుమంతు, మల్లేష్, రాములు, మోనాచారి, బుచ్చయ్య, భీమయ్య, రామచంద్రయ్య, చీపిరి రాములు, కొండ ఆంజనేయులు, తిరుమలాపూర్ నర్సింలుతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నకిలీ ఎరువుల విక్రయాలను కట్టడి చేయాలి

**బిఆర్ఎస్ నాయకులు**




ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**పరిగి , జులై 29 , ప్రభాతవార్త :** నకిలీ డిఏపి ఎరువుల విక్రయాలను అరికట్టాలని బిఆర్ఎస్ నాయకులు పరిగి మండల వ్యవసాయ అధికారిణికి, పరిగి సబ్ ఇన్స్పెక్టర్ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ప్రభుత్వం రైతులకు అవసరమైన డీఏపీ ఎరువులను సకాలంలో అందుబాటులో ఉంచడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ఎరువుల కొరత ఏర్పడి, దానిని ఆసరాగా చేసుకున్న కొందరు దళారులు నకిలీ డిఎపిఎరువులను రైతులకు విక్రయిస్తున్నారని, నకిలీ ఎరువులతో పంటల దిగుబడి దెబ్బతిని రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. నకిలీ ఎరువుల తయారీ, నిల్వ, విక్రయాల్లో పాల్గొంటున్న వారిని వెంటనే గుర్తించి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పరిగి బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు..వ్యవసాయ శాఖ, పోలీసు శాఖలు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నకిలీ డీఏపీ ఎరువుల విక్రయాలను వెంటనే అరికట్టాలని, రైతులకు నాణ్యమైన ఎరువులు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాలను పెంచుదాం

**ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి**

**కేశంపేట, జులై 29 , ప్రభాతవార్త :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమంపై బుధవారం కేశంపేట మండలంలోని నిర్దవెల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ చేదురు వల్లి వల్లి భాస్కర్ గౌడ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేశంపేట ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో వర్షపు నీటి సంరక్షణకు ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలని, రైతులు తమ వ్యవసాయ పొలాల వద్ద నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జల సంరక్షణ ద్వారా భూగర్భ జలాల మట్టం పెరిగి భవిష్యత్తులో నీటి కొరతను అధిగమించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సఫూర అమేర్, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, జీపీఓ వెంకటయ్య, ఐకెపి సీసీ పరంధాములు వార్డు సభ్యులు లక్ష్మణ్ బాబు, నాగరాజు, చంద్రయ్య, చెన్నయ్య, రిజ్వానా బేగం మోహిజ్, మంజుల జంగేష్, అంగన్వాడి టీచర్లు ప్రేమలత , సులోచన, వనజ, జయమని ఆశ కార్యకర్తలు కరుణ, పద్మ, సంగీత, వివోఏలు గోపాల్, చిత్కళ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## చేగూరులో స్వీట్ షాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్సీ

**నందిగామ, జులై 29, ప్రభాతవార్త :** నందిగామ మండలం చేగూర్ గ్రామంలో ప్రోపరేటర్ అరవింద్ ఏర్పాటు చేసిన జై బాలాజీ రాంలాల్ స్వీట్ షాప్ ను బుధవారం ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని, యువతి యువకులు స్వశక్తిపై ఎదిగి ఆర్థిక స్వాలంబన దిశగా పయనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఏసిఎస్ చైర్మన్ మామిళ్ళ విఠల్ ,బుగ్గొనిగూడ మాజీ సర్పంచ్ బండ రాజు, వార్డు సభ్యులు బీఆర్ఎస్ నాయకులు, బంటారాం మల్లేష్ గౌడ్, శివ చారి, తుక్కుగూడ రవి, గుండాల శ్రీను, నర్సిమ, శ్రీశైలం, రవి, మహేందర్, జగన్, సుధాకర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.




చేగూరులో స్వీట్ షాప్ ప్రారంభించిన ఎమ్మెల్సీ

## నేడు నందిగామలో మండల సర్వసభ్య సమావేశం

**నందిగామ, జులై 29, ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రంలో ఈనెల 30 వ తేదీన ఉదయం 10. 30 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో మండల స్థాయి సమీక్ష సమావేశానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని ఇన్చార్జ్ ఎంపీడీవో అరుంధతి తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆమె పేర్కొన్నారు.

# శరవేగంగా ఎలివేటెడ్ కారిడార్ రోడ్డు పనులు

**..అల్వాల్‌లో భూసేకరణకు పరిహారంగా గజానికి రూ .1లక్షా10వేలు చెల్లించటానికి ధర ఖరారు..భూనిర్వాసితుల హర్షం**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 29, ప్రభాతవార్త:** సికింద్రాబాద్-శామీర్‌పేట గ్రామాల మధ్య ప్రభుత్వం చేపడుతున్న ఎలివెటెడ్ కారిడార్ రోడ్డు నిర్మాణం విషయంలో అల్వాల్‌లో భూములు, స్థలాలు కోల్పోతున్న భూనిర్వాసితులకు గజానికి 1లక్షా10వేల రూపాయల చొప్పున పరిహారంగా చెల్లించటానికి జిల్లా స్థాయి భూసేకరణ కమిటీ (డిఎల్ఎస్సి) సమావేశంలో ధరను నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఎలివేటెడ్ కారిడార్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి పనులను శరవేగంగా కొనసాగిస్తున్నారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఈ ఎలివెటెడ్ కారిడార్ రోడ్డు విషయంలో అల్వాల్ ప్రాంత భూనిర్వా సితుల కోసం ధరను నిర్ణయించటానికి (డిఎల్ఎస్సి) జిల్లా స్థాయి భూసేకరణ కమిటీ సమావేశం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సమక్షంలో జరిగింది. దీనిలో డిఆర్ఓ, జిల్లా భూసేకరణ అధికారి మాలతితో పాటు సంబంధిత శాఖల అధికారులు (కమిటీ సభ్యులు) పాల్గొన్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 5గ్రామాలకు సంబందించి భూసేకరణ ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే పోతాయిపల్లి, తూంకుంట, లోతుకుంట గ్రామాల్లో భూసేకరణ పూర్తి జరిగి భూనిర్వాసితులకు కూడ నష్టపరిహారం చెల్లింపు కూడ పూర్తి జరిగిన విషయం తెలిసిందే. ఇక హకీంపేట్‌లోనూ ప్రభుత్వ సంబంధిత భూములు ఉండటంతో సాదారణంగా మామూలుగా భూసేకరణ జరిగి పోయింది. ఇక కేవలం అల్వాల్‌లో భూసేకరణకు యజమానులకు




మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన భూనిర్వాసితుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, పాల్గొన్న డిఆర్ఓ,భూసేకరణ అధికారి మాలతి, సంబంధిత అధికారల దృశ్యం

భూనిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉన్నందున జిల్లా స్థాయి భూసేకరణ కమిటీ సమావేశంలో గజానికి 1లక్షా10వేల రూపాయల చొప్పున చెల్లించటానికి ధర నిర్ణయించటంతో ఈ నిర్ణయం పట్ల భూయజమానులు సంపూర్ణ సంతృప్తిని, హర్షం వ్యక్తం చేశారు.

మిగిలిన ఈ చివరి అల్వాల్‌లో భూసేకరణ ప్రక్రియ కూడ తుది దశకు చేరటంతో వచ్చే నెల లేదా నెలన్నర రోజులలో భూ యజమానులందరికి పరిహారం మొత్తాన్ని చెల్లించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఏది ఏమైనా ఇక సికింద్రాబాద్-శామీర్‌పేట ఎలివెటెడ్ కారిడార్ రోడ్డు నిర్మాణ పనులు రాజీవ్‌రహదారిన జిల్లాకు సంబంధించి జోరుగా సాగుతున్నాయి.

# సినారె కళారత్న - సేవా పురస్కారంతో సర్పంచ్ వెంకటేష్‌కు రాష్ట్రస్థాయి గౌరవం

**-అంకితభావంతో చేసిన గ్రామాభివృద్ధి, ప్రజాసేవకు గుర్తింపుగా ప్రతిష్టాత్మక అవార్డు**

**-హర్షం వ్యక్తం చేసిన కేశంపేట్ మండల సర్పంచులు**

**కేశంపేట, జులై 29, ప్రభాతవార్త :**

కేశంపేట మండలం పరిధి లోని లింగంధన గ్రామ సర్పంచ్, తెలంగాణ సర్పంచ్ల సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు నాగిళ్ల వెంకటేష్‌కు ప్రతిష్టాత్మక డా. సినారె కళారత్న-సేవా పురస్కారం-2026 లభించింది. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, పద్మభూషణ్ డా. సి. నారాయణరెడ్డి 95వ జయంతి సందర్భంగా మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ (మెయిన్ హాల్)లో జరిగిన ఘన కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ ఎంపీ వేణుగోపాల్ ఆచారి చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. యువ ఆర్ట్ థియేటర్స్ సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక సేవా కార్యక్రమాల్లో నాగిళ్ల వెంకటేష్ అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి ఈ ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా



సర్పంచ్ వెంకటేష్‌ను సినారె కళరత్న -సేవా పురస్కరంతో సత్కరిస్తున్న దృశ్యం

నాగిళ్ల వెంకటేష్ మాట్లాడుతూ, ప్రజల విశ్వాసం, సహకారంతోనే తాను సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నానని తెలిపారు. ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో గ్రామాభివృద్ధి, ప్రజాసేవకు మరింత అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. సర్పంచ్ నాగిళ్ల వెంకటేష్‌కు సినారె కళారత్న-సేవా పురస్కారం లభించడం లింగంధన గ్రామానికి గర్వకారణమని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందనలు తెలిపారు.

# ఇండస్ట్రియల్ పార్కు కోసం రైతుల అభిప్రాయ సేకరణ

**దోమ, జులై 29, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొండాయపల్లి, బట్ల సందారం గ్రామాలలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేశారు. రెండు గ్రామాలలో సుమారుగా 650 ఎకరాలుభూసేకరణ చేపట్టేందుకు అధికారులు నిర్ణయించారు. రెండు గ్రామాల గ్రామస్తులు పచ్చటి పంటపొలాల్లో ఇండస్ట్రియల్ పార్కులెందుకు, మేము భూములు ఇవ్వమని దర్నాలు చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. భూములుకోల్పోతే ఆత్మహత్యలు చేసుకుంటామని రైతులు కరాకండి చెప్పుతున్నారు. ఈ విషయంపై బుధవారం నాడు మండల పరిధిలోని కొండాయపల్లి గ్రామములో వికారాబాద్‌జిల్లా డిప్యూటీ కలెక్టర్ వెంకటాచారి, ఆర్‌డిఓ వాసుచంద్ర రైతులతో అభిప్రాయ సేకరణ జరిపారు. భూములు కోల్పోతున్న రైతులను ఎంత నష్టపరిహారంఇవ్వాలని అడిగి తెలుసుకున్నారు. మీ అభిప్రాయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి న్యాయం



రైతులతో మాట్లాడుతున్న డిప్యూటి కలెక్టర్ వెంకటాచారి

చేస్తామనిహామి ఇచ్చారు. రైతుల అభిప్రాయం పోలిసుల పహారాలో జరిగింది. ఈ కార్యక్రమములో దోమ తహాసిల్దార్‌రవిందర్, డిప్యూటి తహాల్దార్ నర్సిములు, రెవెన్యూ ఇన్స్ పెక్టర్లు, రైతులు పాల్గోన్నారు.

# కేశంపేట మండల వార్డు సభ్యుల సంఘం కమిటీ ఏకగ్రీవం

**కేశంపేట, జులై 29, ప్రభాతవార్త :** కేశంపేట మండల వార్డు సభ్యుల కమిటీని బుధవారం కేశంపేట మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల పరిధిలోని పంచాయతీ వార్డు సభ్యుల సంగం కేశంపేట మండల అధ్యక్షుడుగా కుమ్మరి సాయిరాం ఉపాధ్యక్షులుగా జింకల యాదగిరి అబ్బి శ్రీను బొట్టు శ్రీను కుమ్మరి అరవింద్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఆవుల యాదగిరి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వార్డు సభ్యుల గౌరవ అధ్యక్షులుగా గంజాయి దశరథం, గోపని బాలమని భీమయ్య లను ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా కీర్తన మహేష్ చాందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్యార సురేష్ మాట్లాడుతూ వార్డు సభ్యుల న్యాయపరమైన డిమాండ్లను సాధించుకోవడం, వార్డు సభ్యుల సమస్యల పరిష్కారం కోసం కమిటీలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని ఆయన అన్నారు ఈ కార్యక్రమానికి మండల పరిధిలోగల గ్రామపంచాయతీల వార్డు సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వీరనారీల సాధికారతకు వీర రత్న ఫౌండేషన్ కృషి



**-సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత సదస్సు**

**రంగారెడ్డిఅర్బన్, జులై 29,ప్రభాతవార్త:** దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన భారత సాయుధ దళాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల జవాన్ల కుటుంబాలకు అండగా నిలిచి, వీరనారీల సామాజిక, ఆర్థిక సాధికారతకు తోడ్పాటునందించే లక్ష్యంతో వీర రత్న ఫౌండేషన్ (వీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో వీరనారీల మహిళా సాధికారత సదస్సు బుధవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ సైనిక్ ఆరామ్ ఘర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ సహకారం అందించింది. లాభాపేక్షలేని స్వచ్ఛంద సంస్థ అయిన వీర రత్న ఫౌండేషన్, వీరనారులు మరియు వారి పిల్లల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక, ఆర్థిక సాధికారత కోసం వివిధ కార్యక్రమాలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ఒరియంటేషన్ కార్యక్రమంలో వీరనారులు, వారి కుటుంబ సభ్యులకు సంస్థ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సేవలు, వాటిని పొందే విధానం, సంస్థ లక్ష్యాలు, విలువలు, భవిష్యత్ కార్యాచరణపై సమగ్ర అవగాహన కల్పించారు. సంస్థతో సులభంగా అనుసంధానం కావడం ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందే అవకాశాలపై కూడా వివరించారు. వీర రత్న ఫౌండేషన్ ప్రతినిధి శ్రీమతి దీప్తి శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వీరనారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సుమారు 30 మంది లబ్ధిదారులు హాజరై సంస్థ అందిస్తున్న సేవలు, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ ఎన్.ఆర్. బాబు మాట్లాడుతూ, వీరనారులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం నిరంతరం సేవలందిస్తున్న వీర రత్న ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు వీరనారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. వీరనారులు, వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేసిన ఆయన, తెలంగాణ రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ ఎల్లప్పుడూ వారి సంక్షేమం కోసం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి శ్రీనేష్ కుమార్ నోరి తదితర అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుని కలిసిన ఉద్యాన విద్యార్థులు

**-పలు అంశాలపై వినతిపత్రం అందజేత**

**అత్తాపూర్ జులై29,ప్రభాతవార్త :**

గాంధీ భవన్‌లో నిర్వహించిన మంత్రుల ముఖాముఖి కార్యక్రమంలో ఉద్యాన విద్యార్థులు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుగారిని కలిసి పలు కీలక అంశాలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉద్యాన శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యాన విస్తరణాధికారులు మరియు ఉద్యాన అధికారులపోస్టులను తక్షణమే భర్తీ చేయాలని విద్యార్థులు కోరారు. అలాగే వ్యవసాయ విశ్వవిద్యాలయంలో హార్టికల్చర్ కోర్సు, ఉద్యాన కళాశాల ఏర్పాటు ప్రతిపాదనను ఉపసంహరించుకుని, ఉద్యాన విద్య శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలోనే కొనసాగుతుందని స్పష్టమైన హామీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల వినతిపై మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుగారు సానుకూలంగా స్పందించి, వ్యవసాయ విశ్వవిద్యాలయంలో హార్టికల్చర్ కోర్సు మరియు ఉద్యాన కళాశాల ఏర్పాటు ప్రతిపాదనను ఉపసంహరించుకుంటామని, ఉద్యాన విద్య శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలోనే కొనసాగుతుందని స్పష్టమైన హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్ర ఉద్యాన శాఖలో ఖాళీగా ఉన్న హెచ్ఈఓ మరియు హెచ్ఓ పోస్టులను కూడా భర్తీ చేసేందుకు అవసరమైన చర్యలు చేపడతామని భరోసా కల్పించారు. మంత్రి హామీలపై ఉద్యాన విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ,



ప్రభుత్వం వీలైనంత త్వరగా నిర్ణయాలను అమలు చేయాలని కోరారు. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఉద్యాన కోర్సు ఏర్పాటు ప్రతిపాదనను ఉపసంహరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోలో ఉద్యాన విద్యార్థి నాయకులు సంగారెడ్డి, సాయికిరణ్, చంటి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సర్పంచ్ బాబు నాయక్

## జల సంరక్షణతోనే భవిష్యత్ తరాలకు నీటి భద్రత

**షాద్‌నగర్, జులై 29, ప్రభాతవార్త :** ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెల్ జర్ల గ్రామంలో జలసిర్థి కార్యక్రమంలో భాగంగా గ్రామసభను ఘనంగా నిర్వహించారు. గ్రామ అభివృద్ధి, జల సంరక్షణ, భూగర్భ జలాల పెంపుపై గ్రామస్తులతో విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ రాత్లవత్ బాబు నాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టనున్న ఇంటింటికీ ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ సోక్ పిట్స్, ప్రతి రైతుకు పంట కుంటలు, ప్రతి గ్రామానికి ఊట కుంటలు, బోర్‌వెల్ రీఛార్జ్ వ్యవస్థ వంటి జల సంరక్షణ కార్యక్రమాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకించే చర్యలు చేపట్టడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చని వివరించారు. ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత నిర్మించుకోవాలిసర్పంచ్ రాత్లవత్ బాబు నాయక్ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం లభిస్తున్న ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీలోని ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించుకునే బాధ్యతను ప్రజలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం, పరిహారం అందే అవకాశం ఉందని తెలిపారు. అదేవిధంగా బోర్‌వెల్‌ల సమీపంలో వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంచే విధానాలను ప్రజలు పాటించాలని సూచించారు. ప్రతి పొలంలో ఫాంపాండ్, ప్రతి ఇంటి వద్ద సోక్ పిట్, బోర్‌వెల్ రీఛార్జ్ వ్యవస్థలను ఏర్పాటు చేయడం ద్వారా నీటి వనరులను కాపాడుకోవచ్చని తెలిపారు. తక్కువ నీటితో అధిక దిగుబడి వచ్చే పంటలపై దృష్టి రైతులు తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడి, ఆదాయం వచ్చే పంటలను సాగు చేయడంపై దృష్టి సారించాలని సర్పంచ్ సూచించారు. వర్షపు నీటిని సంరక్షి ంచి భూమిలోకి ఇంకించే చర్యలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా చేపట్టాలని పిలుపునిచ్చారు. జల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొడాల వెంకటేష్ యాదవ్, వార్డు సభ్యులు పవన్ కుమార్, రవి నాయక్, రమేష్, వెంకటయ్య, కావాలి లక్ష్మయ్య, లావణ్య దేవేందర్, దొడ్డి లక్ష్మి రవీందర్, ప్రవలిక మహేష్, చందర్ నాయక్, వడ్ల అనిత ఆచారి, తుప్పారి వనజ కుమార్, పంచాయతీ కార్యదర్శి బాల మల్లేష్, జిపిఓ విష్ణు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, ప్రభుత్వ అధికారులు, రైతులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## ఎస్ఐఆర్‌లో ఓటర్లందరూ తప్పకుండా పేర్లు నమోదు చేసుకోవాలి

**అత్తాపూర్ ,జులై29,ప్రభాతవార్త :**

ఎస్ఐఆర్‌లో ఓటర్లందరూ తప్పకుండా పాల్గొని తమ పేర్లను నమోదు చేసుకోవాలని మేడ్చల్ జిల్లా ప్రభారీ, రాష్ట్ర యువమోర్చ పూర్వ అధ్యక్షులు సేవెళ్ళ మహేందర్ పేర్కొన్నారు. ప్రవాస్ యోజనలో భాగంగా బుధవారం అత్తాపూర్ హైదర్ గూడ డివిజన్ లలోని అన్ని బూత్‌లలో మేడ్చల్ జిల్లా ప్రభారీ, రాష్ట్ర యువమోర్చ పూర్వ అధ్యక్షులు సేవెళ్ళ మహేందర్ పర్యాటించారు. ఈ సందర్భంగా బిజెపి ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్. వాల్ప్ డెస్క్ లను పరిశీలించి ఓటర్లకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్క ఓటరూ తప్పకుండా తమ ఎన్యుమరేషన్ ఫారంను నింపి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని వారికి బిజెపి నాయకులు, కార్యకర్తలు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఓటర్లకు ఏమైనా సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్ ద్వారా నివృత్తి చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు కూడా ఎమ్యూనరేషన్ ఫార్మ్ అందని వారు వారి ఓటర్ ఐడి కార్డు ఆధార్ కార్డు తమతో తీసుకొని వస్తే ఎమ్యూరేషన్ ఫారమ్ ఏ బి.ఎల్.ఓ. దగ్గర ఉందో వాటి వివరాలు కూడా తమ కార్యకర్తలు యాప్‌లో పరిశీలించి తెలియజేస్తారన్నారు. గడవు ముగిసిలోగా ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్‌లో తమ ఓటర్ వివరాల నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మోంద్ర కొమురయ్య , డివిజన్ బిజెపి అధ్యక్షులు సులిగె వెంకటేష్, కాడెం సుధాకర్, సుదర్శన్ ప్రసాద్ తివారి, ఎస్. జయానంద్ రెడ్డి, కాకులారం కృష్ణ, కే. కిరణ్ చారి, పి. వెంకట్ రెడ్డి, విజయ్ స్వామి, బీట్కూరి సతీష్, జీ. అమర్ నాథ్ రెడ్డి, ఎస్. వాసు, శశికాంత్ శర్మ, మిద్దెల సరిత, విజయ లక్ష్మి, బీఎల్ఏ నారగూడెం సోమ్ నాథ్ రెడ్డి, ఎస్. మణికంఠ, శివ రాజ్ గౌడ్, వంశీ, తాటి రాజు, కైల రవీందర్ రెడ్డి, సులిగే శ్రీనివాస్, ఎన్. విశ్వనాథ్ రెడ్డి మరియు నాయకులు కార్యకర్తలు బీఎల్ఓ.లు నిషిత ప్రభు గౌడ్ మోనిక శోభన్, అనురాధ పాల్గొన్నారు.

## చెంగిచెర్ల సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సామర్థ్యం పెంపు

**8 ఎంవీఏ స్థానంలో 12.5 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ చార్జింగ్**

**సుమారు 25 వేల కనెక్షన్లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా**

**హైదరాబాద్, జులై 29,ప్రభాతవార్త:**

వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసే చర్యలు టిజిఎస్పిడిసిఎల్ చేపట్టింది.

పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచే చర్యల్లో భాగంగా, మేడ్చల్ జోన్, హబ్సిగూడ సర్కిల్, కీసర డివిజన్, ఘట్‌కేసర్ సబ్‌డివిజన్, మేడిపల్లి సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ చెంగిచెర్ల సబ్‌స్టేషన్‌లో ప్రస్తుతం ఉన్న 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 12.5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి బుధవారం విజయవంతంగా చార్జ్ చేశారు.

ఈ సామర్థ్య పెంపుతో చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని సుమారు 25,000 విద్యుత్ సర్వీసులకు ప్రయోజనం చేకూరనుంది. పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ తగ్గడంతో పాటు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను సమర్థవంతంగా నిర్వహించడం, ఓవర్‌లోడింగ్‌ను నివారించడం, వోల్టేజ్ స్థాయులను మెరుగుపరచడం ద్వారా వినియోగదారులకు మరింత స్థిరమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ఈ సామర్థ్య పెంపు దోహదపడనుంది.

ఈపవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్య పెంపుతో చెంగిచెర్ల గ్రామం, క్రాంతి కాలనీ ఫేజ్1 నుంచి 5, ఎంఎల్ఆర్ కాలనీ, అక్షయ నగర్, వెంకటసాయి నగర్, ప్రివిలేజ్, సాయి రెసిడెన్సీ, వెంకటాద్రి నగర్, కృష్ణా నగర్, నందిని నగర్, దత్తాత్రేయ నగర్, రాజేష్ నగర్ ఫేజ్1 నుంచి 3, ద్వారకా నగర్ ఫేజ్1 2, రాధికా నగర్, స్టాలిన్ కాలనీ, టీఎస్ ఫుడ్స్ కాలనీ, శివగణేష్ నగర్, యాదయ్య నగర్, కాకతీయ కాలనీ, కమలానగర్, చిన్న క్రాంతి కాలనీ, జయశ్రీ కాలనీ, అరవింద ఎన్‌క్లేవ్, అక్షయ ఎన్‌క్లేవ్, బుద్ధ విహార్, రామకృష్ణ నగర్, మై విల్లాస్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడనుంది.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్. నర్సింహులు, సిఈమేడ్చల్ పి.వి. రమేష్, ఎస్ఈహబ్సిగూడ పి. వెంకన్న, డీఈ/కీసర టి. లింగయ్య, డీఈ/టీఆర్ఈ మేడ్చల్ కె. రామకృష్ణారెడ్డి, ఏడీఈ/ఘట్‌కేసర్ వై. విజయ్ కుమార్ రెడ్డి, ఏడీఈ/టీఆర్ఈ ఎన్. శ్రీధర్, ఏడీఈ/ప్రొటెక్షన్ జయశ్రీ, ఏడీఈ/లైన్స్ ఎం. రత్నాచారితో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అక్షరజ్ఞానం నేర్పిన గురువుకు ఘన నివాళి..

**షాద్‌నగర్, జులై 29, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే టిడిపి పోలీసు బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు కు విద్యాబుద్ధులు నేర్పి సమాజంలో తనను గుర్తింపు రావడానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన తన గురువు గారైన దండు జనార్దన్ కు తన నివాసంలో గురు పౌర్ణమి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కొండన్నగూడ గ్రామానికి చెందిన మల్లేష్ యాదవ్, మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు గురు పౌర్ణమి సందర్భంగా పూలమాలలు శాలువాలతో వారి రాజకీయ గురువు అయిన బక్కని నరసింహులు గారిని సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంపీడీవో దండు శరత్ చంద్రబాబు, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ అన్మారి వెంకటయ్య, టీడీపీ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, ఒగ్గు కిషోర్, డాక్టర్ వెంకటరమణ, పత్రికా విలేఖరి బాల రాజేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.


తన గురువు చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు

# కాళికాదేవి ఆలయానికి భూమి పూజ

**తలకొండపల్లి జులై 29, ప్రభాతవార్త:**
తలకొండపల్లి మండల కేంద్రం సమీపంలో నూతనంగా కాళికాదేవి ఆలయ నిర్మాణానికి బుధవారంనాడు శంకుస్థాపన చేశారు. మాజీ జెడ్పిటిసి పద్మ నరసింహ, మాజీ సర్పంచ్ పెరుమల లలిత జ్యోతయల ఆధ్వర్యంలో కాళికా దేవి ఆలయాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు వారు తెలిపారు. శిథిలావస్థకు చేరుకున్న కాళికాదేవి ఆలయాన్ని పునర్నిర్మానం చేపట్టి నూతన దేవాలయాన్ని నిర్మించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పద్మ నరసింహ మాజీ సర్పంచ్ లలిత జోతయ్య, ఉప సర్పంచ్ కోటేశ్వర్, పోతుగంటి కుమార్, ఇటముని వెంకటేష్ లక్ష్మి ్క కాంత్ జంగయ్య రవి అమరేందర్ భాష శీను కుమార్ నవీన్ తదితరులు ఉన్నారు.


విద్యా కమిషన్ సభ్యుడు వెంకటేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న లండం చిన్న జంగయ్య

## విద్యారంగ సమస్యలను పరిష్కరించండి

**ఆమనగల్లు, జులై 29, ప్రభాతవార్త;** ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల, తలకొండపల్లి మండలాలకు ముఖ్య కూడలిగా పేరుగాంచిన ఆమనగల్లు పట్టణాన్ని విద్యాహబ్‌గా తీర్చిదిద్ది పేద మధ్యతరగతి విద్యార్థులకు న్యాయం చేయాలని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు లండం చిన్న జంగయ్య బుధవారం రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారగొండ వెంకటేష్ ను కోరారు. పలువురు యువకులతో కలిసి చిన్న జంగయ్య మర్యాద పూర్వకంగా కమిషన్ సభ్యుడిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థల వివాదం, షాబాద్‌లో నడుస్తున్న ఆమనగల్లు గురుకుల పాఠశాలతో పాటు డిగ్రీ కళాశాల సొంత భవనం నిర్మాణానికి, పాలిటెక్నిక్ కళాశాల కొరకు ప్రత్యేక చొరవ చూపాలని కోరినట్లు లండం చిన్న జంగయ్య తెలిపారు. కాగా కమిషన్ సభ్యుడు వెంకటేష్ సానుకూలంగా స్పందించి ఆమనగల్లును విద్యాహబ్‌గా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తానని అందుకు ఆమనగల్లులోని విద్యారంగంలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపుతానని తెలిపారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం ఎడ్యు కేషనల్ కోఆర్డినేటర్ లండం యాదయ్య, సోషల్ మీడియా ఇంఛార్జీ లండం రాఘవేందర్, లండం మహేష్, లండం చింటూ, లండం పెద్ద పుల్లయ్య, బయ్యా చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కడ్తాల్ మండల పరిషత్ సమావేశం

**కడ్తాల్, జులై 29, ప్రభాతవార్త;** ఈనెల 30న గురువారం కడ్తాల్ రైతు వేదికలో మండల పరిషత్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సుజాత నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాలు ప్రజాప్రతినిధులు అధికారులు సకాలంలో సమావేశానికి రావాలని ఎంపిడిఒ సుజాత నాయక్ కోరారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం!

**కొందుర్గు, జులై 29, ప్రభాతవార్త;** మండల సర్వసభ్య సమావేశం నేడు గురువారం ఉదయం 11:30 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశం హాల్లో ఏర్పాటు చేసినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీరాములు తెలిపారు. మండల స్థాయి అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు , గ్రామ పరిపాలన అధికారులు, సర్పంచులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా శాసనసభ్యులు పాల్గొంటున్నారని ఆయన తెలిపారు.


పంచాయతీ సెక్రెటీకి, సర్పంచ్ ప్రమీల గౌడ్ వినతి పత్రం అందజేస్తున్న మొయిజ్ ఖురేషి

## ధారూరు బస్టాండ్ వద్ద తాత్కాలిక డబ్బాలను తొలగించాలని వినతి

**ధారూరు, జులై 29, ప్రభాత వార్త:** ధారూరు మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో కుక్కింద రోడ్డు వైపు ఆర్టీసీ కాంపౌండ్ ఎదురుగా రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన తాత్కాలిక డబ్బాల వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బం దులతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొంటూ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ధారూరు మండల ఎంఐఎం అధ్యక్షుడు ముహమ్మద్ మొయిజ్ ఖురేషీ ఆధ్వర్యంలో గ్రామ మండల ప్రజల శ్రేయస్సు ను దృష్టిలో ఉంచుకొని ఈ తాత్కాలిక డబ్బాలను వెంటనే తొలగించాలని కోరుతూ ధారూరు గ్రామ పంచాయతీ సెక్రటరీకి, సర్పంచ్ ప్రమీల గౌడ్ కు బుధవారం ఈ వినతి పత్రం అందజేశారు.

## ధారూర్‌లో ఫీల్డ్ అసిస్టెంట్ల మీటింగ్ బహిష్కరణ

**ధారూర్, జులై 29, ప్రభాత వార్త:** ధారూర్ మండలంలో గత మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఫీల్డ్ అసిస్టెంట్లు విధులకు మీటింగ్‌కు దూరంగా ఉంటున్నారు. ఈ మేరకు ధారూర్ మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారికి నర్సింలు కు ఫీల్డ్ అసిస్టెంట్లందరూ కలిసి వినతిపత్రం బుధవారం సమర్పించారు. గత కొంతకాలంగా వేతనాలు అందకపోవడం వల్ల కుటుంబాలను పోషించడం కష్టమోతోందని, ఇదే విషయాన్ని అధికారులు గమనించి తక్షణమే పెండింగ్ జీతాలను విడుదల చేయాలని వారు కోరారు. జీతాలు అందే వరకు సమావేశాలకు హాజరుకాలేకపోతున్నామని స్పష్టం చేశారు.

## గుండ్లపోచంపల్లి డివిజన్ బీజేపీ సమావేశం


సమావేశంలో పాల్గొన్న బిజెపి నాయకులు

**మేడ్చల్, జులై 29. ప్రభాతవార్త:** గుండ్లపోచంపల్లి డివిజన్ బీజేపీ కార్యవర్గ సమావేశాన్ని డివిజన్ పార్టీ అధ్యక్షుడు కావేరి శ్రీధర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు విక్రమ్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదని, దేశ సేవను పరమ ధ్యేయంగా తీసుకుని పనిచేసే జాతీయవాద ఉద్యమం అని అన్నారు. ప్రతి కుటుంబానికి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరవే యడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళలకు సాధికారత, రైతులకు తోడ్పాటు, ప్రతి పౌరునికి మంచి పాలన అందించడం కూడా అభివృద్ధిలో భాగమే అని వారు తెలిపారు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిద్దామని అన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం మనందరి బాధ్యత అని, ప్రజలకు అవసరమైన చోట పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉండాలని అన్నారు అనంతరం గుండ్లపోచంపల్లిలో నల్ల బిల్లులు ఇష్టానుసారంగా పెంచడం, అంతర్గత రహదారుల దుస్థితి, వీధిదీపాల నిర్వహణలేమి వంటి అనేక ప్రజా సమస్యలపై సమావేశంలో తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు రంజిత్ మోహన్, నాయకులు కృష్ణ గౌడ్, లక్ష్మారెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, హంసారాణి, నాగరాజు, కార్యదర్శి వెంకటేష్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీసుల అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

**అత్తాపూర్ , జులై29, ప్రభాతవార్త :**
రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు మరోసారి తమ సమయస్ఫూర్తిని చాటుకున్నారు. బుధవారం పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే మెహదీపట్నం వైపు పిల్లర్ నం. 278 సమీపంలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న సమయంలో ఓ కారు ఇంజిన్‌లో ఒక్కసారిగా మంటలు అంటుకోవడాన్ని పోలీసులు గమనించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ సిబ్బంది ఏమాత్రం ఆలస్యం చేయకుండా మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

## రెవెన్యూ సమస్యలపై దృష్టి సారిస్తా : తాసిల్దార్ అయ్యప్ప

**యాచారం , జులై 29, ప్రభాతవార్త :**
యాచారం మండల పరిధిలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తాసిల్దార్ అయ్యప్ప తెలిపారు. బుధవారం యాచారం మండల కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పార్మసిటి, సర్, మొండి గౌరెల్లి భూ సేకరణ, తక్కలపల్లి ఫార్మాసిటీ రోడ్డు నిర్మాణ పనులు ఉండడంతో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కొంత జాప్యం జరిగిందని అన్నారు. దీంతో మాపై పని ఒత్తిడి పెరిగిందని గుర్తు చేసారు. అయినా కూడా మండల పరిధిలో ఉన్న రైతుల రెవెన్యూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని చెప్పారు. పై అధికారుల ఆదేశాల మేరకు పనిచేస్తున్నామని పేర్కొన్నారు. త్వరలోనే రెవెన్యూ పెండింగ్ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. త్వరలోనే గ్రామాల వారీగా నెలకొన్న రెవెన్యూ సమస్యలపై దృష్టి సారిస్తామని తెలియజేశారు.

## ప్రతి నీటి బొట్టును వడిసి పట్టాలి

**యాచారం , జులై29, ప్రభాతవార్త :**
యాచారం మండల పరిధిలోని మంతన్ గౌడ్ గ్రామ పంచాయతీ ఆవరణలో ఎలి నినో, జలసిరిపై అవగాహనసదస్సు పై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఇందులో నీటి సంరక్షణ ప్రభుత్వ పథకాలపై గ్రామ ప్రజలకు, రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించామని తెలిపారు. కార్యక్రమ ముఖ్య ఉద్దేశాలు ముఖ్యాంశాలు జల సంరక్షణ ఇంకుడు గుంతలు, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతల నిర్మాణం, కమ్యూనిటీ సోక్ పిట్‌ల ఏర్పాటు ప్రాముఖ్యతను వివరించినట్లు తెలిపారు. బోరుబావులు, బావుల వద్ద రక్షణ భూగర్భ జలాలను పెంపొందించేందుకు బోర్‌వెల్స్, బావుల దగ్గర ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునే విధానంపై అవగాహన కల్పించాము. రైతు నమోదు (ఫార్మర్ రిజిస్టర్): రైతులందరూ తమ వివరాలను ఫార్మర్ రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలి. రాబోయే ఆగస్టు నెలలో ప్రారంభం కానున్న పంట నమోదు కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరడమైనది. ఈ కార్యక్రమంలోసర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఏఈఓ నవ్య పంచాయతీ సెక్రెటరీ, ఐకేపీ సీసీ మరియు బుక్ కీపర్, గ్రామ పెద్దలు, రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ సమగ్ర సవరణను ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలి

**యాచారం, జులై 29, ప్రభాతవార్త :** భారత ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల సమగ్ర సవరణ ప్రతి ఒక్కరు నమోదు చేసుకోవాలని , ఓటు హక్కును భద్రపరుచుకోవాలనిబుధవారం రోజు నంది వనపర్తిలో ఎస్ఐఆర్ నమోదు చేసుకావాలని బిఆర్ఎస్ నాయకులు గోరటి వెంకటేశం తెలిపారు. అర్హులైన పౌరులు తప్పిపోకుండా చూసుకుంటూ, మరణించిన, శాశ్వతంగా మార్చబడిన, నకిలీ, పౌరులు కాని ఓటర్ల పేర్లను తొలగించడం ద్వారా భారతదేశం అంతటా ఓటర్ల జాబితాలు నిర్దిష్టమైన నిర్ధారించడం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) లక్ష్యం అని, తప్పకుండా అందరూ ఈ ప్రక్రియను నమోదు చేసుకోవాలని, ఇది భారత పౌరుల యొక్క అందరి బాధ్యత అని అన్నారు. నంది వనపర్తి గ్రామంలో ఇప్పటివరకు దాదాపు 80 మంది నమోదు చేసుకున్నారని బి ఎల్ ఓ లు తెలిపినట్లు పేర్కొన్నారు. గ్రామంలో నమోదు చేసుకోని 20 ప్రజలు తప్పనిసరిగా ఆగస్టు 3వ తేదీ లోపు తమకు అందించిన ఓటర్ పారాలను పూరించి, స్థానిక బిఎల్ఓ లకు ఇవ్వగలరని కోరారు. ఏదైనా సమాచారం కావాలంటే గ్రామపంచాయతీ వద్దకు వచ్చి బిఎల్ఓ లను సంప్రదించాలని, తప్పనిసరిగా అందరూ ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు.

## రిడ్స్ అవార్డు అందుకున్న రోటర్ డామ్ ఇంటర్నేషనల్ స్కూల్

ఘట్‌కేసర్ రూరల్, జులై 29, ప్రభాత వార్త: పోచారం డివిజన్ చౌదరిగూడలోని రోటర్ డామ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు ప్రతిష్టాత్మక రిడ్స్ అంతర్జాతీయ అవార్డు లభించినట్లు స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె. రూపారెడ్డి తెలిపారు. అంతర్జాతీయ అవార్డును న్యూఢిల్లీలోని లీ మెరిడియన్ హోటల్‌లో పాఠశాల ప్రతినిధులకు అందజేసినట్లు తెలిపారు. అంతర్జాతీయ దృక్పథం, ప్రపంచ స్థాయి సహకారం, వినూత్న బోధన అభ్యాస విధానాలను ప్రోత్సహించినందుకు రోటర్ డామ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు రిడ్స్ అవార్డు లభించినట్లు పేర్కొన్నారు. ఈ అవార్డును పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. రూపారెడ్డి, రిడ్స్ కో ఆర్డినేటర్ ఐ. సుచిత్ర పద్మావతి చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. ప్రతిష్టాత్మక గుర్తింపు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమిష్టి కృషికి నిదర్శనంగా నిలిచిందని అన్నారు. ఈ అవార్డు పాఠశాల విద్యా ప్రస్థానంలో మరో మైలురాయిగా నిలిచిందని భవిష్యత్తులో ప్రపంచ దృక్పథంతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలనే రోటర్ డామ్ ఇంటర్నేషనల్ స్కూల్ సంకల్పాన్ని మరింత బలపరిచిందని ప్రధానోపాధ్యాయురాలు అన్నారు.

## మంచినీటి పైప్ లైన్ నిర్మాణానికి శంకుస్థాపన

**మేడ్చల్, జులై 29, ప్రభాతవార్త :**
ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని మైసిరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న మంచినీటి పైపు లైన్ నిర్మాణ పనులకు బుధవారం స్థానిక వార్డు కౌన్సిలర్ సద్ది నిశితతో కలిసి మున్సిపల్ చైర్ పర్సన్ లావుడ్య శ్రీదేవి శంకుస్థాపన చేశారు. మున్సిపల్ అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా చైర్ పర్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డితో కౌన్సిలర్ అర్చన, మాజీ సర్పంచ్ కరుణాకర్, మున్సిపల్ మేనేజర్ ఉమాదేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధాపూర్ సమస్యపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు వినతి

**షాద్‌నగర్, జులై 29, ప్రభాతవార్త :** కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామంలో ప్రతిపాదిత ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం ఏర్పాటు వల్ల ప్రభావితమయ్యే ఎస్సీ కుటుంబాలు, అసైన్డ్ భూములు కోల్పోయిన రైతులు, చిన్న, సన్నకారు రైతుల హక్కులు, ఆరోగ్యం, తాగునీరు, జీవనోపాధిని రక్షి ంచాలని కోరుతూ బీజేపీ నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందె బాబయ్య ఢిల్లీలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులువడ్డేపల్లి రామ్‌చందర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిద్ధాపూర్, పరిసర గ్రామాల్లోని పలువురు ఎస్సీ కుటుంబాలకు గతంలో ప్రభుత్వం అసైన్డ్ భూములు కేటాయించిన విషయాన్ని కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకెళ్లినట్లు నాయకులు తెలిపారు. అనంతరం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి భూములను స్వాధీనం చేసుకున్నప్పటికీ, ప్రస్తుతం అదే ప్రాంతంలో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు రావడం పట్ల ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నదని వివరించారు. ప్రజా విచారణ నిర్వహించకుండా ప్రాజెక్టు ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నారని కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదిత ప్రాజెక్టును తక్షణమే నిలిపివేసి, పర్యావరణపరంగా సురక్షి తమైన ప్రత్యామ్నాయ ప్రాంతాన్ని పరిశీలించాలని జాతీయ ఎస్సీ కమిషన్‌ను కోరినట్లు వెల్లడించారు. న్యాయం జరుగుతుందనే ఆశాభావం సిద్ధాపూర్ సమస్యను జాతీయ ఎస్సీ కమిషన్ గంభీరంగా పరిగణించి, ప్రభావిత ఎస్సీ కుటుంబాలు, రైతులకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకుంటుందనే ఆశాభావాన్ని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, ఆందే బాబయ్య వ్యక్తం చేశారు.






న్యూ మోడల్ కార్ అవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

## న్యూ మోడల్ బ్రెజ్జా కార్ అవిష్కరణ

**ఆవిష్కరించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**

**షాద్‌నగర్, జులై 29, ప్రభాతవార్త :** ప్రముఖ మారుతి సుజుకి డీలర్ శ్రీ జయరామ మోటార్స్ షాద్ నగర్ లోని చటాన్ పల్లిలో గల షోరూమ్‌లో న్యూ బ్రీజా కార్ ఆవిష్కరణ సందర్భంగా పూజా కార్యక్రమం అనంతరం సరికొత్త న్యూ మోడల్ మారుతి సుజుకి బ్రీజా కారును ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ మారుతి సుజుకి సంస్థ భారతీయ వాహన రంగంలో దశాబ్దాలుగా మిడిల్ క్లాస్ మరియు సామాన్య ప్రజల నమ్మకాన్ని సొంతం చేసుకుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు వాణి పాండురంగారెడ్డి, అశోక్ యాదవ్ మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచులు తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులు శేరి శ్రీనివాస్ రెడ్డి, దినేష్ సాగర్, అన్వారి రాజు పేపర్ శివ, మహేష్, యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగానికి వెళ్లిన యువతి అదృశ్యం

**శంషాబాద్, జులై 29, ప్రభాతవార్త :** ఓ చాక్లెట్ కంపెనీకి పనికి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన శంషాబాద్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సిఐ సురేందర్ రెడ్డి వివరాల ప్రకారం.. శంషాబాద్ మండలంలోని పెద్దషాపూర్ గ్రామానికి చెందిన కొమ్మగల్ల కల్పన (25) అనే యువతి గత కొద్ది రోజులుగా షాద్‌నగర్ మండలంలోని చటన్‌పల్లి గ్రామంలోని ఓ చాక్లెట్ కంపెనీలో ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తోంది. ఎప్పటిలాగే ఈ నెల 28వ తేదీన ఉదయం సుమారు 8 గంటల ప్రాంతంలో కంపెనీకి వెళ్తున్నానని ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి బయలుదేరి వెళ్లింది. అయితే సాయంత్రం 5:30 గంటలు దాటినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే ఆమె మొబైల్ ఫోన్ నంబర్‌కు పలుమార్లు ఫోన్ చేయగా, స్విచ్ ఆఫ్‌లో ఉన్నట్లు తెలిసింది. అనంతరం కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టడంతో పాటు బంధువులను సంప్రదించినప్పటికీ, యువతి ఆచూకీ లభించలేదు. దీంతో బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.


అదృశ్యమైన యువతి కల్పన

## గుడికి వెళ్లి వాగులో శవమై తేలిన మహిళ

**శంషాబాద్, జులై 29, ప్రభాతవార్త :** ఎల్లమ్మ గుడికి వెళ్లి కొబ్బరికాయ కొటివస్తానని వెళ్లిన ఓ మహిళ వాగులో శవమై తేలిన ఘటన శంషాబాద్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సిఐ సురేందర్ రెడ్డి వివరాల ప్రకారం... మహబుబ్‌నగర్ జిల్లా జడ్జర్లకు చెందిన బుద్దమొల్ల అంజమ్మ (49) కూలీగా పనిచేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి శంషాబాద్ మండలం పిల్లోనిగూడ గ్రామంలో నివాసం ఉంటున్నారు.

మంగళవారం మధ్యాహ్నం సుమారు 3:30 గంటలకు తన చిన్న కుమార్తె శ్రీవాణికి గ్రామ సమీపంలోని వెంటేరు వాగు పక్కన ఉన్న ఎల్లమ్మ గుడికి వెళ్లి కొబ్బరికాయ కొట్టి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, గ్రామ పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు.

బుధవారం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో గ్రామంలోని వెంటేరు వాగు వద్ద గాలింపు చేపట్టగా, అంజమ్మకు చెందిన చెప్పులు, కొబ్బరికాయ, వాటర్ బాటిల్ వాగు ఒడ్డున కనిపించాయి. అనంతరం వాగులో గాలించగా ఆమె మృతదేహం నీటిపై తేలియాడుతూ కనిపించింది. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువచ్చి పరిశీలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు గుర్తించారు. ప్రాథమిక సమాచారం మేరకు వాగు వద్ద కాలు జారి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి బూత్‌లో కార్యకర్తలు కృషి చేయాలి

**జవహర్ నగర్, జులై 29 ,ప్రభాత వార్త:** మేడ్చల్ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్, ప్రతి బూత్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గజ్జల కాంతం పిలుపునిచ్చారు.

బుధవారం జవహర్‌నగర్ వీఆర్వో కార్యాలయంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రతి కార్యకర్త వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

నియోజకవర్గంలోని ప్రతి డివిజన్, ప్రతి బూత్‌ను సందర్శిస్తూ కార్యకర్తలకు మనోధైర్యం కల్పించి పార్టీని మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు పేద ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చాయని, ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావాలంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని కోరారు.

ఓటరు జాబితా నుంచి ఎవరి పేరూ తొలగిపోకుండా ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని, ఓటు హక్కును పరిరక్షి ంచడం ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి ఓటరిని చైతన్యపరిచి ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పీసీసీ నాయకులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు గొడుగు వేణు, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, జమాల్పూర్ నవీన్, మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, అనంతలక్ష్మి ్క, బూడిద వెంకటేష్, జవహర్‌నగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సోమ నర్సింగ్ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాసుల రవి సాయి తదితరులు పాల్గొన్నారు.

## చురుకుగా కొనసాగుతున్న ఇకెవైసి

**తలకొండపల్లి, జులై 29, ప్రభాతవార్త:**
రేషన్ కార్డుదారులకు పౌరసరఫరాల శాఖ నిర్ణయించిన ఈ కేవైసీ గడువు ఈనెల 31న ముగుస్తుంది. దీంతో తలకొండపల్లి మండలంలో నీ ఆయా గ్రామాలలోని రేషన్ షాపులలో ఈ కేవైసీ కార్యక్రమం చురుకుగా కొనసాగుతుంది. గత వారం రోజులుగా తలకొండపల్లి మండలంలోని అన్ని గ్రామాల రేషన్ షాపులలో రేషన్ డీలర్ లు ప్రతిరోజు ఉదయాన్నే ఈ కేవైసీ కార్యక్రమాన్ని రాత్రి వరకు కొనసాగిస్తున్నారు. రేషన్ డీలర్ లో షాపుల వద్ద మరియు తమ ఇంటి వద్ద ఈ కేవైసీని ఎంత ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. తలకొండపల్లి మండలంలో మొత్తం 45,183 మంది రేషన్ ఓల్డర్లు ఉండగా, అందులో ఇప్పటివరకు 34, 174 మంది ఈ కేవైసీ ని పూర్తి చేసుకున్నారు. మిగిలిన 11009 మంది ఈ కేవైసీ ని పూర్తి చేసుకోవలసి ఉండగా అధికారుల ఆదేశం మేరకు ఈ కేవైసీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుంది. తలకొండపల్లి మండలంలో మొత్తం 26 రేషన్ షాపులు ఉండగా అన్ని షాపులలోని రేషన్ డీలర్లు ఈ కేవైసీని చురుకుగా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన గడువు కేవలం రెండు రోజులే ఉండడంతో ఎలాగైనా పూర్తి చేయాలని అధికారుల ఆదేశం మేరకు పీకే వైసీని పనులు విజయవంతంగా కొనసాగిస్తున్నారు.

ఇప్పటికైనా అన్ని గ్రామాలలోని ఈ కేవైసీని చేయించుకొని లబ్ధిదారులందరూ ఆయా గ్రామాల రేషన్ షాపు డీలర్ల వద్దకు వెళ్లి ఈకేవైసీని పూర్తి చేయించుకోవలసి ఉంటుందని, లేనిచో వారందరికీ రేషన్ బియ్యం రద్దయ్యే ప్రమాదం ఉందని అందుకే ఈ కేవైసీ చేయించుకొని వారందరూ త్వరితగతిన తమ తమ గ్రామాల్లో నీ రేషన్ డీలర్ల వద్ద ఈ కేవైసీ ని పూర్తి చేసుకోవాలని మండల అధికారులు తెలియజేస్తున్నారు.

## ఇంకుడు గుంతకు భూమి పూజ

**తలకొండపల్లి జులై 29, ప్రభాతవార్త:**
తలకొండపల్లి మండల కేంద్రంలో నూతనంగా ఇంకుడు గుంత ఏర్పాటుకు బుధవారం నాడు గ్రామ సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్ శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ఉత్తర్వుల్లో భాగంగా తలకొండపల్లి గ్రామానికి చెందిన గడ్డల యాదయ్య ఇంటి సమీపంలో నూతనంగా ఇంకుడు గుంత ఏర్పాటు కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్ మాట్లాడుతూ అధికారుల సూచన మేరకు జలసిరిలో భాగంగా భూగర్భజలాలను పెంచేందుకుగాను గ్రామంలోని ప్రతి ఒక్కరు తమ ఇంటి సమీపంలో ఇంకుడు గుంత ఏర్పాటు గ్రామంలోని ప్రతి ఒక్కరు తమ ఇంటి సమీపంలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలనే ఆదేశంతో తలకొండపల్లిలో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామంలోని అందరూ తమ తమ ఇంటి సమీపంలో ఏర్పాటు చేసుకొని నీటి నిల్వను కాపాడుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, ఉప సర్పంచ్ ఉప సర్పంచ్ లోకం కోటేశ్వర్ నూకం కోటేశ్వర్, మాజీ సర్పంచ్ లలిత జోతయ్య, గ్రామ కార్యదర్శి సత్యం వార్డు సభ్యులు వెంకటేష్ యాదవ్ కుమార్ లక్ష్మి ్కకాంత్ చంద్రయ్య రవికుమార్ పాండు యాదయ్య జంగయ్య శీను లింగం ప్రశాంత్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి మాజీ సర్పంచ్ నర్సింహ మృతి

**ఘట్‌కేసర్, జులై 29, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ ఉమ్మడి మండలంలోని మేడిపల్లి మాజీ సర్పంచ్ కుతాడి నర్సింహ్మా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఘట్‌కేసర్ ఉమ్మడి మండలంలో గ్రామ పంచాయతీగా ఉన్న మేడిపల్లి గ్రామానికి నర్సింహ్మా సర్పంచ్‌గా, ఎంపిటిసి సభ్యులుగా చేసి ప్రజలకు సేవలు అందించారు. ఆయన మరణవార్త తెలుసుకున్న ఘట్‌కేసర్ సర్కిల్ నాయకులు మేడిపల్లిలోని ఆయన ఇంటికివెళ్లి నర్సింహ్మా పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు-ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి నర్సింహ్మా మృతికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

బుధవారం స్వగృహానికి వెళ్లి కుతాడి నర్సింహ్మా పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ విషాద సమయంలో ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. మేడిపల్లి బిజెపి అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, బిజెపి జిల్లా కార్యదర్శి జైపాల్ రెడ్డి, బీజేవైఎం నాయకులు బండారు పవన్ రెడ్డి, బీసీ సంఘం జిహెచ్ఎంసి ఉపాధ్యక్షులు కె. సతీష్ కుమార్‌లు నర్సింహ్మాకు నివాళులు అర్పించారు.

## ఘనంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళా

**దౌల్తాబాద్, జులై 29, ప్రభాతవార్త:**
వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో దౌల్తాబాద్ మండలకేంద్రంలోని రైతు వేదికలో బుధవారంరోజు విత్తన మేళ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు నాణ్యమైన ధృవీకరించబడిన విత్తనాల వినియోగం, విత్తనాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతమైన అవగాహన కల్పించారు. ప్రభుత్వం సూచించిన పంటరకాల సాగువిధానాలతో పాటు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా పక్కా బిల్లు తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ గ్రామ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ అధికారిణి జి. తులసి, ఏఈఓ వైష్ణవి, ఉప సర్పంచ్ సావిత్రమ్మ ఆశప్ప, గ్రామస్థులు దస్తప్ప, సాయిలు, విత్తన డీలర్లు గోపి, విజయ సింహ్, రైతులు పాల్గొన్నారు.



# అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానమార్గాన్ని చూపించేది గురువే

**మేడ్చల్, జులై 29. ప్రభాతవార్త :** గురుపౌర్ణమి సందర్భంగా మేడ్చల్ పట్టణంలోని షిర్డీ సాయిబాబా దేవాలయంలో బుధవారం అత్యంత వైభవంగా వేడుకలు నిర్వహించారు. సుప్రభాత సేవతో ప్రారంభమైన ఉత్సవాలను రోజంతా భక్తిశ్రద్ధలతో కొనసాగించారు. అభిషేకం, అర్చనలు, గురుపూజ, భజనలు, హారతి, అన్నదాన కార్యక్రమాలు భక్తిపూర్వకంగా నిర్వహించారు.

ఆలయ ట్రస్ట్ ఫౌండర్ దాత్రిక సింహం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం ఉందని, అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానమార్గాన్ని చూపించే గురువును స్మరించుకునే పవిత్ర దినమే గురుపౌర్ణమి అని తెలిపారు. షిర్డీ సాయిబాబా


మేడ్చల్‌లోని సాయిబాబా ఆలయంలో బాబాను దర్శించుకున్న మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

మానవాళికి ప్రేమ, సేవ, సహనం, సమానత్వం అనే గొప్ప సందేశాన్ని అందించారని, ప్రతి ఒక్కరూ గురువులను గౌరవించి, వారి ఆశయాలను జీవితంలో ఆచరించాలని చెప్పారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు, మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ ఉపాధ్యక్షుడు రాజు మైసరి, మేడ్చల్, కిష్టాపూర్ పూడూర్, గుండ్లపోచంపల్లి డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాపరాజు ముదిరాజ్, మల్లేష్ గౌడ్, సురేందర్ ముదిరాజ్, ఆయా పార్టీల నాయకులు చీర్ల రమేష్, మల్లికార్జున్ స్వామి, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, బాలమల్లేష్, విష్ణుచారీ, రమణారెడ్డి, దయానంద్ యాదవ్, శేఖర్ గౌడ్, పంజగారి అంజనేయులు, సత్యనారాయణ, లింగం, నవీన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, తుదుం గణేష్, నాగరాజు, రవి ముదిరాజ్, శివ శంకర్, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## గురుపౌర్ణమి మహోత్సవంలో కర్మాఖ్య చిత్ర బృందం

**జవహర్ నగర్ ,జులై 29,ప్రభాత వార్త:** దమ్మాయిగూడ అయ్యప్ప కాలనీలోని శ్రీశ్రీశ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి మహోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబాకు పంచావింశతి (75) కలశాలతో మహాభిషేకం, సహస్ర పుష్పార్చన నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా కర్మాఖ్య సినిమా దర్శకుడు అదిరే అభి, చిత్ర బృందంలోని నటీనటులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు సాయిబాబా దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని బాబా ఆశీస్సులు పొందారు. ఆలయ నిర్వాహకులు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి, భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు.


ఘట్‌కేసర్ శివారెడ్డిగూడలో సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

## ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

**ఘట్‌కేసర్,జులై 29,ప్రభాత వార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో బుధవారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు సాయి మందిరాలకు చేరుకొని బాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఘట్‌కేసర్‌లో హరిహారభవాని క్షేత్రం, ద్వారకానగర్, శివారెడ్డిగూడ, కొండాపూర్, ద్వారకానగర్, ఎన్‌ఎఫ్‌సీనగర్, ఎదులాబాద్ తదితర చోట్ల గురుపూర్ణిమ ఉత్సవాలు భక్తి, శ్రద్ధలతో నిర్వహించారు. ఆయా కాలనీల్లో మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు బాబాకు కాకడ హరతి, అభిషేకం, అర్చన, చందన హరతి తదితర పూజలు చేసి నిర్వహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. శివారెడ్డిగూడలోని శ్రీశ్రీశ్రీ శిరిడిసాయిబాబ సంస్థానం ఆలయంలో చైర్మన్ కొంతం రాంరెడ్డి ఆధ్వర్యంలో బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం కాకడ హరతీ, బాబాకు పంచామృత అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఈకార్యక్రమంలో మండల మాజీ ఆర్‌బిఎస్ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, ఆలయ ఉపాధ్యక్షులు కొంతం నర్సింహ్మారెడ్డి, మాజీ వార్డుసభ్యులు బొక్క ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎదులాబాద్‌లో సాయిబాబాకు ప్రత్యేక అభిషేకాలు చేయగా బాబా దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఎముకె కొండయ్య, భాస్కర్, బాల్‌రాజ్‌లు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ కాలేరు సురేందర్, కీసరగుట్ట డైరక్టర్ సామల అమరేందర్, జైనవీన్, సామల నవీన్, పొత్కని మల్లిఖార్జున్‌రాజు తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

## సాయిబాబా కృపతో నియోజకవర్గ ప్రజలకు శుభం కలగాలి

**షాద్‌నగర్, జులై 29, ప్రభాతవార్త :** షాద్ నగర్ పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో గురు పూర్ణిమ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయిబాబా వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర, నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, భక్తులు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు స్వాగతం పలికి ఆశీర్వాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, కౌన్సిలర్లు జి.టి వసంత శ్రీనివాస్, శారద శేఖర్, జయలక్షి ్మ కిషోర్, గోపాల్, ఎస్పీ శివ, మాజీ కౌన్సిలర్లు వెంకట్రాం రెడ్డి, చిన్న యాదగిరి, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, బిక్షపతి, ప్రేమ్ కుమార్ గౌడ్, గుండు అశోక్, రాఘవేందర్ గౌడ్, పులిజాల నవీన్, వెంకటేష్, నవీన్, శ్రీకాంత్ తదితరులు సాయిబాబా భక్తులు మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## శామీర్‌పేట మండల పిఆర్‌టియు టిఎస్ అధ్యక్షులుగా దొండ మహేశ్

..ప్రధాన కార్యదర్శిగా ఆకెళ్ల గోపాల్ లు ఏకగ్రీవ ఎన్నిక

**శామీర్‌పేట, జులై 29, ప్రభాతవార్త:**శామీర్‌పేట మండల పిఆర్‌టియు టిఎస్ నూతన కార్యవర్గంను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం శామీర్‌పేటలోని ప్రాథమిక పాఠశాలలో మండల పిఆర్‌టియు టిఎస్ కమిటీ నూతన కార్యవర్గంను ఉపాధ్యాయులు ఎన్నుకున్నారు. మండల పిఆర్‌టియు టిఎస్ అధ్యక్షులుగా దొండ మహేశ్, ప్రధాన కార్యదర్శిగా ఆకెళ్ల గోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా అసోసియేట్ అధ్యక్షులుగా రవీంద్రచారి, ఉపాధ్యక్షులుగా బి.వెంకటేశ, కార్యదర్శులుగా మధు, రాజు లు ఎన్నికయ్యారు. మహిళా విభాగంలో అసోసియేట్ అధ్యక్షురాలుగ శ్రీలక్ష్మి, మహిళా ఉపాధ్యక్షురాలుగ బి.శ్వేత, మహిళా కార్యదర్శులుగా మమత, శిరీషలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి పిఆర్‌టియు టిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ ఆనందరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మండల నూతన కమిటీకి ఎన్నికైన వారిని ఆయన అభినందించారు. మండల కమిటీ అధ్యక్షులు దొండ మహేశ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకు, అదే విధంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ ఉపాధ్యాయులు సంక్షేమానికి ప్రాధాన్యతను ఇస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు టిఎస్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొని నూతన కార్యవర్గంను అభినందించారు.

## మృతుడి కుటుంబానికి చేయూతగా రూ.18 వేల ఆర్థిక సహాయం

**షాబాద్, జులై 29, ప్రభాతవార్త :** షాబాద్ మండలం సర్దార్‌నగర్ గ్రామంలో ఇటీవల పశువుల మార్కెట్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సవాళ్ల రామస్వామి కుటుంబానికి ఆయన స్నేహితులు చేయూతనందించారు.

నిరుపేద కుటుంబం తీవ్ర విషాదంలో ఉండటంతో 2009-2010 బ్యాచ్‌కు చెందిన స్నేహితులు కలిసి రూ.18 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన వారు, కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సమాజంలో ప్రతి ఒక్కరూ అవసరంలో ఉన్నవారికి చేయూతనివ్వాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దాదె మహేష్, నరేష్, ప్రవీణ్, నర్సింలు, అనిల్, ఆనంద్, రామకృష్ణ, తేజ, నవీన్, గీత తదితరులు పాల్గొన్నారు.

## గురుపౌర్ణమి వేడుకలలో హాజరైన పోలీస్‌శాఖ

**ఆమనగల్లు, జులై29, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని షిర్డిసాయి ఆలయంలో బుధవారం గురుపౌర్ణమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. వేడుకలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పట్టణ భక్తులతోపాటు చుట్టుప్రక్కల ప్రాంతాల నుండి హాజరై సాయినాధున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గురుపౌర్ణమి వేడుకల పురష్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమాలు, అర్చనలు, వ్రతాలు నిర్వహించారు. సుప్రభాత సేవతో మొదలైన వేడుకలు మధ్నాహ్నం అన్నప్రసాదం వితరణ వరకు కొనసాగాయి. దీంతో ఆలయ పరిసరాలు సాయినాథస్మరణతో మారుమ్రోగాయి. ఉదయం నుండే భక్తుల రాక మొదలు కావడంతో ఆలయ పరిసరాలు క్రిక్కరిసిపోయాయి. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు.వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన పోలీస్‌శాఖ ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు, ఎస్సై సంతోష్‌రెడ్డి, ఆలయ అభివృద్ది కమిటి సభ్యుడ, 5వవార్డు కౌన్సిలర్ పాపిశెట్టిరాము శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మధుసూదన శర్మ, కౌన్సిలర్స్ జగన్ భాగ్యలక్ష్మి, శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ దార్ల చిత్తరంజన్ దాస్, ఆంజనేయులు, నయనాచారి, రవి కిరణ్, శివాజీ, లింగంపల్లి ఆనంద్, రాములు, మల్లికార్జున్, సునీత, శ్రీను నాయక్, భుజంగం లక్ష్మీపతి, పూసలి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



గురపౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న సిఐ వెంకటేశ్వరు, ఎస్సై సంతోష్‌రెడ్డి, కౌన్సిలర్ పాపిశెట్టి రాము, ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


నందిగామలో సాయి బాబ దేవాలయంలో పూజల్లో పాల్గొన్న సర్పంచ్ కొమ్ము కృష్ణ తదితరులు.

## నందిగామలో భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు...

**నందిగామ, జులై 29, ప్రభాతవార్త :** నందిగామ మండలంలో బుధవారం గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలు సాయిబాబా దేవాలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. నందిగామ మండల కేంద్రంలో ఉన్న శ్రీ సాయి శివ రామాంజనేయ స్వామి దేవాలయంలో ఉన్న సాయిబాబ కు సర్పంచ్ కొమ్ము కృష్ణ అభిషేకం చేశారు. చేగూర్ లో ఉన్న సాయినాధుని దేవాలయంలో మాజీ ఎంపీపీ లు మంచన్ పల్లి ప్రియాంక శివశంకర్ గౌడ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. హెచ్ బి ఎల్ పరిశ్రమలో ఉన్న సాయినాధుని సన్నిధిలో అన్నదానం చేశారు. పవిత్ర గురు పౌర్ణమి సందర్భంగా సాయి దేవాలయాల్లో సాయి నామ స్మరణతో మారుమోగాయి. గురు పౌర్ణమి పురస్కరించుకొని నందిగామ అయ్యప్ప స్వామి అయ్యప్ప భక్తులు పూజలు చేశారు. గురుబ్రహ్మ శ్రీశ్రీశ్రీ కీర్తిశేషులు సతీష్ నాయర్ గురుస్వామి చిత్రపటానికి అయ్యప్ప భక్తులు అశోక్ గౌడ్ , తుమ్మల నరసింహులు, బి కృష్ణ యాదవ్ , అంజి యాదవ్ రమేష్ తదితరులు పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ వేడుకల్లో ఏఎంసీ డైరెక్టర్ సి నర్సింలు, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కేశమోని రామచంద్రి, నాయకులు బలిజ లింగం, బోర్ర జంగయ్య, ఏం ప్రభయ్య,అభిరామ్, ఎర్రగారి రమేష్, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## గురువును గౌరవించడం భారతీయ సంస్కృతిలో గొప్ప సంప్రదాయం


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, జులై 29, ప్రభాతవార్త :** గురుపౌర్ణమి సందర్భంగా రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ 6వ వార్డులోని సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యంత విశిష్టమైన స్థానం ఉందని అన్నారు. మన జీవితానికి సరైన మార్గాన్ని చూపించి, జ్ఞానాన్ని అందించే గురువులను ఎల్లప్పుడూ గౌరవించుకోవాలని సూచించారు. గురువుల ఆశీస్సులు, మార్గదర్శకత్వం ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో కీలకమని పేర్కొన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా సద్గురువులను స్మరించుకోవడంతో పాటు, సత్యం, ధర్మం, సేవా మార్గంలో నడవాలని ఆయన ఆకాంక్షి ంచారు.సాయిబాబా బోధించిన ప్రేమ, శాంతి, సేవా భావాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, మానవతా విలువలు పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గురుపౌర్ణమి సందర్భంగా ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని సాయిబాబాను ప్రార్థించినట్లు తెలిపారు.భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలుఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, వైస్ చైర్మన్ బాబర్ అలీఖాన్, కౌన్సిలర్లు రాజు నాయక్, బచ్చలి నరేష్, దిలీప్ కుమార్, కొప్పునూరి ప్రవీణ్ కుమార్, శివ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు లత శ్రీశైలం గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ అధ్యక్షుడు విజయ్ కుమార్‌తో పాటు ముబారక్ అలీఖాన్, కమ్మదనం సుధాకర్, వెంకట్ రాంరెడ్డి, శ్రీనివాస్, అమర్నాథ్ రెడ్డి, మహేందర్, చంద్రశేఖర్ రెడ్డి, సంతోష్, బీవీఎం రెడ్డి తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై సాయిబాబా దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## ఘనంగా గురుపూజోత్సవం

**కొడంగల్ రూరల్, జులై 29 (ప్రభాతవార్త):** గురు పౌర్ణమి వేడుకలను కొడంగల్ మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. బుధవారం కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు వ్యాస మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా గురు పౌర్ణమి విశిష్టతను పాఠశాల ప్రిన్సిపాల్ డివి.నరేశ్‌రాజ్ విద్యార్థులకు వివరించారు. గురువే సర్వస్వమని, విద్యార్థులు గురువుల పట్ల గౌరవంగా మెలగాలని సూచించారు. ఉపాధ్యాయులను పూలమాలు, శాలువాలతో విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు డి.లక్ష్మి వెంకటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## భార్య హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

రూ.5 వేల జరిమానా విధించిన షాద్‌నగర్ అదనపు ప్రత్యేక సెషన్స్ కోర్టు..

**షాద్‌నగర్, జులై 29, ప్రభాతవార్త :** కడ్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన భార్య హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ షాద్‌నగర్‌లోని 16వ అదనపు ప్రత్యేక సెషన్స్ జడ్జిఎస్. స్వాతిరెడ్డి బుధవారం తీర్పు వెలువరించారు. పోలీసుల వివరాల ప్రకారం.. 2023 జూన్ 12న కడ్తాల్ మండలం కర్కల్‌పహాడ్ గ్రామంలోని ఎస్ఎస్ ఫాంహౌస్‌లో వల్లపుదాసు శ్రీనివాస్ (43) తన భార్య వల్లపుదాసు స్వరూపను హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై కడ్తాల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


శామీర్‌పేట డివిజన్‌లోని తూంకుంటలో పర్యటించి ఎస్ఐఆర్ ప్రక్రియపై మహిళలతో మాట్లాడుతున్న మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్,పాల్గొన్న నాయకుల దృశ్యం

## ఓటరు ఇంటింటికి వెళ్లి పరిశీలించాలి

**శామీర్‌పేట, జులై 29, ప్రభాతవార్త:**

ఓటరు ఫారాలు తీసుకుని నింపి ఇవ్వని వారి ఇంటికి బిఎల్‌ఓలు, బిఎల్‌ఏలు వెళ్లి పరిశీలించాలని, వాటిని నింపి స్వీకరించాలని, ప్రతి అర్హుడైన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో వచ్చేలా చూడాలని, ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎన్యుమరేషన్ ఫారాలను నింపి ఇవ్వటానికి బిఎల్‌ఓలు, బిఎల్‌ఏలు ప్రజలకు సహకరించాలని మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ సూచించారు. ఎస్ఐఆర్ ఫారాల స్వీకరణ చివరి రోజు గడువు సమీపిస్తుందని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటా పర్యటించి ఫారాలు తిరిగి ఇవ్వని వారిని గుర్తించి వాటిని పరిశీలించాలని సహకరించాలని సూచించారు. బుధవారం శామీర్‌పేట డివిజన్ పరిధిలోని తూంకుంటలో మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ పర్యటించి ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. గ్రామంలో ఉన్న మహిళలకు ఓటరు నమోదు ఎస్ఐఆర్ ప్రక్రియ గురించి వివరించారు. ఓటరు ప్రాధాన్యత గురించి ప్రజలకు వివరించారు. ఎన్యుమరేషన్ ఫారాలు నింపి బిఎల్‌ఓలకు త్వరగా ఇవ్వాలని, సందేహాలు ఉంటే బిఎల్‌ఓలను, బిఎల్‌ఏలను అడిగి తెలుసుకోవాలని ఆయన సూచించారు. బిఎల్‌ఓలు, బిఎల్‌ఏలు ఇంటింటా పర్యటించి ఎన్యుమరేషన్ ఫారాలు నింపి ఇవ్వని వారిని గుర్తించి వాటిని నింపి స్వీకరించేలా చూడాలని, ప్రతి అర్హుడైన ఓటరు కూడ ఓటరు జాబితా నుంచి అన్యాయంగా తొలగించకుండా చూడాలని బిఎల్‌ఓలను, బిఎల్‌ఏలను, కాంగ్రెస్ పార్టీ నాయకులకు కూడ ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి పి.మహిపాల్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, శామీర్‌పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు నక్క సందీప్‌గౌడ్, పలువురు కాంగ్రెస్ నాయకులు టిఆర్ రవీందర్‌గౌడ్, సంబంధిత అధికారులు, బిఎల్‌ఓలు, బిఎల్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

## అనంతారం గ్రామంలో రోడ్డు ప్రమాదం

మద్యం మత్తులో ఉన్న వ్యక్తి టివిఎస్‌బైక్‌ను ఢీకొన్న వైనం

**శామీర్‌పేట, జులై 29, ప్రభాతవార్త:**

అనంతారం గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందారు. శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అనంతారం గ్రామంలో రోడ్డు ప్రమాదం మంగళవారం రాత్రి జరిగింది. శామీర్‌పేట పోలీసుల కథనం ప్రకారం అనంతారం గ్రామానికి చెందిన షేక్ జమీల్ మంగళవారం రాత్రి టివిఎస్ ఎక్స్‌ఎల్ బైక్‌పై కిరాణా షాప్‌కి వెళ్లి కిరాణా సామాన్లు తీసుకుని తిరిగి ఇంటికి ఆయన టివిఎస్ ఎక్స్‌ఎల్‌పై వస్తుండగ తన ఇంటికి కొద్ది దూరంలోనే క్షీరసాగర్ వైపున నుంచి లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన నివాసి కావలి మల్లేశ్ అనే వ్యక్తి మద్యం మత్తులో ఉండి తన కారును అతివేగంగా, నిర్లక్ష్యంగా రాంగ్‌రూట్‌లో నడుపుకుంటూ వచ్చి టివిఎస్‌పై వెళ్తున్న షేక్ జమీల్‌ను ఢీకొన్నట్లు పోలీసులు తెలిపారు. దీంతో షేక్ జమీల్ తలకు తీవ్రమైన రక్తగాయాలు కావటంతో వెంటనే చికిత్స నిమిత్తం ఆర్‌విఎం హాస్పిటల్‌కు తరలిస్తుండగానే మార్గమధ్యలో షేక్ జమీల్ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని కుమారుని ఫిర్యాదు మేరకు శామీర్‌పేట పోలీసులు విచారణ చేపట్టారు. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బోనాల చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే దానం

**జూబ్లీహిల్స్, జులై 29, ప్రభాతవార్త:**

బోనాల పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో ఉన్న దేవాలయాల అభివృద్ధి కమిటీ సభ్యులకు బుధవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చెక్కులను పంపిణీ చేశారు. ఆనంద్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో భాగంగా మొత్తం 136 చెక్కులను ఎమ్మెల్యే ఆయా కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పండుగలకు ప్రత్యేక నిధులు కేటాయించడమే కాకుండా వాటిని సక్రమంగా ఆయా కమిటీలకు అందిస్తుందన్నారు.

ఆలయాల ధూపదీప నైవేద్యాలకే కాకుండా ఏడాదికి ఒకసారి రంగులు వేయించుకోవడానికి, ఆలయాభివృదికి ఈ నిధులను ఉపయోగించుకోవాలని సూచించారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు వర్షపు నీరు నిలువకుండా చూసుకోవాలని సూచించారు. బోనాల పండుగను ప్రతి ఒక్కరూ ఘనంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు భారతీనాయక్, వనం సంగీతయాదవ్, మహాలక్ష్మిరామన్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నేతలు షరీఫ్, మహేందర్‌బాబు, రాములు చౌహాన్, అరుణ్, నరేష్, దేశం శ్రీనివాస్‌గౌడ్, ఆంథోని, శ్రీనివాస్‌రెడ్డి, జహంగీర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గురువు లేనిదే విజ్ఞానం లేదు

-ప్రిన్సిపాల్‌కు సన్మానం


ఘట్‌కేసర్‌లో గురువు నారాయణరెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

**ఘట్‌కేసర్, జులై 29, ప్రభాతవార్త:** విద్యాబుద్దులు నేర్పిన గురువులను ఎప్పటికి మారువరాదని బిజెపి రాష్ట్రకార్యవర్గసభ్యులు -ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ గురుకుల్ ప్రిన్సిపాల్ నారాయణరెడ్డిని బుధవారం ఆయన శాలువాతో సన్మానించి పాదాభివందనం చేశారు. గురుపౌర్ణమి సందర్భంగా మాజీ ఎంపిపి తనకు ఇంటర్మీడియట్‌లో బోధించిన నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి యోగక్షేమాలు తెలుసుకొని సత్కరించి ఆశీస్సులు పొందారు. శాలువాతో ఆయనను సన్మానించి పూలమొక్క అందజేశారు. గురువులేనిదే విజ్ఞానం లేదని గురుపౌర్ణమి రోజున సార్‌ను సన్మానించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు ఆనంద్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## గురువులు సమాజానికి మార్గదర్శకులు

**మోమిన్‌పేట్,జులై29,ప్రభాతవార్త:** గురు పూజోత్సవా న్ని పురస్కరించుకొని మోమిన్‌పేట్ మండల ప్రజలకు మన చంద్ర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఏ.చంద్రప్రియ హృదయపూర్వక శుభాకాంక్షలు బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజనిర్మాణంలో గురువులపాత్ర అత్యంత కీలకమని, విద్యార్థుల్లో జ్ఞానం, క్రమశిక్షణ, విలువలను పెంపొందిం చడంలో గురువులు చేస్తున్న సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. గురువు లను గౌరవించడం భారతీయ సంస్కృతి లో గొప్ప సంప్రదాయమని, ప్రతి ఒక్కరూ తమ జీవితంలో మార్గనిర్దేశం చేసిన గురువులను ఈ సందర్భంగా స్మరించుకోవాలని సూచించారు. గురువుల ఆశీస్సులతో ప్రతి విద్యార్థిని, విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, మండల ప్రజలందరికీ గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.


డాక్టర్ ఏ.చంద్రప్రియ

## గురువుల మార్గదర్శకత్వమే విద్యార్థుల భవిష్యత్తుకు బాట


పబ్లిక్ పాఠశాలలో గురు పూర్ణిమ వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

**కేశంపేట, జులై 29 ప్రభాతవార్త:**

కేశంపేట మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామంలోని వీఐపీ పబ్లిక్ పాఠశాలలో గురు పూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలలో వేద మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ,, వేదాలను ప్రపంచానికి అందించిన మహర్షి వేదవ్యాసుడి జన్మదినాన్ని పురస్కరించుకొని గురు పూర్ణిమను జరుపుకుంటారని తెలిపారు.గురువులు విద్యార్థులకు కేవలం విద్యను మాత్రమే కాకుండా మంచి నడవడి, క్రమశిక్షణ, నైతిక విలువలను నేర్పించి వారి భవిష్యత్తుకు సరైన మార్గనిర్దేశం చేస్తారని అన్నారు. సమాజంలో గురువులకు ఎంతో ఉన్నతమైన స్థానం ఉందని పేర్కొన్నారు.విద్యార్థులు తమ గురువులను గౌరవించి, వారు చూపించే మార్గంలో నడవాలని సూచించారు. గురువుల ఆశీస్సులతోనే విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వెంకటకృష్ణ, కరస్పాండెంట్ నరేష్, వైస్ ప్రిన్సిపాల్ ఎండీ వాజీద్, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

న్యూ పవర్ కుంగ్ అకాడమీ ఆధ్వర్యంలో

## గురువులకు సన్మానం

**షాద్‌నగర్, జులై 29, ప్రభాతవార్త :** షాద్ నగర్ పట్టణంలోని సత్యనారాయణ స్వామి దేవాలయం వద్ద న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ కోచ్ అహ్మద్ ఖాన్ తన గురువుగారైన బాలరాజ్ మాస్టర్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు తమ కోచ్ అహ్మద్ మాస్టర్, బాలరాజ్ మాస్టర్ ను ఘనంగా సన్మానించి వారి యొక్క గురుభక్తిని చాటుకున్నారు. గురువు ఎల్లప్పుడూ తన శిష్యులను ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షించే వ్యక్తి గురువుగారని వారి యొక్క ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


కరాటే గురువులను సన్మానిస్తున్న విద్యార్థులు